
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 13 జూన్ 2025

స్టాంపుల కొరత...

- వెండర్ల చేతివాటం..!
- రూ.100 ఈ-స్టాంపు రూ.250 నుంచి 300
- అరకొరగా జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

రైల్వేకోడూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్టాంపుల కొరతతో వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రూ.100 ఈ-స్టాంపును రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. దీంతో అరకొరగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ తంతు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా జరుగుతోందని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ-స్టాంపులను అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ఈ-స్టాంపులను అన్ని రిజిస్ట్రేషన్లకు ఉపయోగిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతంలో ఉన్న స్టాంపులను వినియోగంలోకి తీసుకురావాలని చర్యలు తీసుకున్నా ఇంతవరకు ఆ స్టాంపులు వినియోగంలోకి రాలేదు. దీంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా జరుగుతున్నాయి. రెండున్నర సంవత్సరాల కిందట వైసీపీ ప్రభుత్వం నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను రద్దు చేసి ఈ-స్టాంపులను అమల్లోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ పాత నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను మనుగడలోకి తీసుకుని వచ్చింది. గతంలో నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను వెండర్లకు కావాల్సినంత ఇచ్చేవారు. రూ.10, 20, 50, 100 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు నేరుగా ప్రింట్ అయి వస్తాయి. ఈ-స్టాంపులు అలా కాకుండా వెండర్లు ఆన్‌లైన్‌లో ఎన్ని రూపాయలకు కావాలన్నా వస్తాయి. విజయవాడలోని కార్యాలయం నుంచి స్టాంపులు తగినన్ని రాని కారణంగా రైల్వేకోడూరులోని వెండర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఆన్‌లైన్‌లో తీసే ఈ-స్టాంపులకు సర్వర్ పనిచేయడం లేదన్న సాకుతో రూ.10, 20, 50 స్టాంపులు లేవని చెప్పి కేవలం రూ.100 ఉన్నాయని వాటిని రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయాలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. స్టాంపుల కొరతతో ముమ్మరంగా జరగాల్సిన రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను వెండర్లకు 500 నుంచి 2 వేల వరకు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ-స్టాంపులను ఎలాంటి ప్రింటింగ్ లేకుండా ఎర్ర పేపర్‌ను తిరుపతిలోని స్టాక్‌హోల్డింగ్స్ నుంచి తీసుకుని వచ్చి ఆన్‌లైన్‌లో వినియోగదారుడు ఎంత అడిగితే అంత ప్రింట్ తీసుకుని ఇచ్చేవారు. స్టాంపుల కొరత ఉన్న కారణంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేసి ఎక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ-స్టాంపులను కూడా ఎక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారని పలువురు అంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, చిట్వేలి మండలాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కువగా రైల్వేకోడూరు నుంచే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. స్టాంపు డ్యూటీ కూడా పంచాయతీలకు వస్తుంది. రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరిగేవి. ప్రస్తుతం స్టాంపుల కొరతతో రిజిస్ట్రేషన్లు అరకొరగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు తగిన చర్యలు తీసుకుని వెండర్ల దోపిడీని అరికట్టాలని, స్టాంపుల కొరత లేకుండా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.



పుల్లంపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం





స్టాంపుల కొరతతో ఇబ్బందులు

స్టాంపుల కొరతతో అనేక ఇబ్బందులు పడుతున్నాము. నేను భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని 6 స్టాంపులు కావాలని వెండర్‌ను అడిగితే లేవని చెప్పారు. చివరకు రూ.100 స్టాంపులు 6 తీసుకుంటే 1500 అదనంగా తీసుకున్నారు. ఇంత ధర ఎందుకని ప్రశ్నిస్తే ఇంతే అని సమాధానం ఇచ్చాడు. గత్యంతరం లేక తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాము

- నల్లంశెట్టి రమణయ్య, వైకోట, ఓబులవారిపల్లె మండలం



15 రోజుల్లో అందుబాటులోకి వస్తాయి

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల నెంబర్లు పొరపాటుగా వచ్చాయని సరఫరా నిలిపివేశారు. వాటిని క్షుణ్ణంగా అధికారులు పరిశీలిస్తున్నారు. 15 రోజుల్లో స్టాంపులు అందుబాటులోకి వస్తాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- మహ్మద్ రఫీ, సబ్ రిజిస్ట్రార్, పుల్లంపేట



12 స్టాంపులకు రూ.2400 తీసుకున్నారు

12 స్టాంపులకు రూ.2400 తీసుకున్నారు. స్టాంపుల కొరత ఉందని సాకు చెప్పి అదనంగా వినియోగదారుల దగ్గర తీసుకుంటున్నారు. వెండర్ల చేతివాటానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- ఎర్రా గంగులయ్య, వై.కోట, ఓబులవారిపల్లె మండలం

నేడు వెలిగల్లు పార్కులో యోగాంధ్ర


వెలిగల్లు పార్కును పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం, తదితరులు

గాలివీడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు పార్కులో శుక్రవారం ఉదయం యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. ఆయన గురువారం వెలిగల్లు ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తప్పక హాజరు కావాలని తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగభూషణం, ఎంపీడీవో జవహర్‌బాబు, తహసీల్దార్ భాగ్యలత, ఎంఈవో-1 2 వెలిగల్లు ఇరిగేషన్ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా చార్జ్‌షీట్లు దాఖలు చేయండి

- నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి


రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారుల నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్ష పడేలా సాక్ష్యాధారాలతో చార్జిషీట్లను నిర్ణీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారులకు నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలన్నారు. టూరిస్ట్ వీసాపైన జిల్లాలోకి ప్రవేశించి వీసా సమయం అయిపోయినా జిల్లాలో ఉండే వారిని గుర్తించి వారిని వారి దేశాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలకు (బ్లాక్‌స్పాట్స్) గుర్తించి పరిష్కార మార్గాలు చూడాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించడానికి నిఘా పెంచాలని, స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, బాలికలు, బలహీనవర్గాలపై జరిగే నేరాల పట్ల మరింత సున్నితంగా వ్యవహరించాలని, వారికి భరోసా కల్పించాలని తెలిపారు. సమావేశంలో స్థానిక పోలీసు అధికారులు, రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

- హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెల్లడి

పెద్దతిప్పసముద్రం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించిన గృహ నిర్మాణ పనులను ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి లబ్ధిదారులు పూర్తి చేసేలా సిబ్బంది అవగాహన కల్పించి పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. గురువారం ఆయన పట్టెంవాండ్లపల్లెలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను తనిఖీ చేసి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వం అందించే అదనపు నిధులతో గృహ నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం గృహ నిర్మాణ పనులకు ప్రభుత్వం అదనంగా నిధులను అందిస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని, హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ శ్రీకాంత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జి.అశోక్, ఎం.సుజాత, తదితరులు పాల్గొన్నారు.


పట్టెంవాండ్లపల్లెలో గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ సాంబశివయ్య

ఇక జిల్లా నుంచే మెప్మా కార్యకలాపాలు

- మెప్మా కార్యాలయాన్ని ప్రారంభించిన డీఆర్వో

రాయచోటిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు కడప జిల్లా నుంచి జరిగిన మెప్మా కార్యకలాపాలు ఇక నుంచి అన్నమయ్య జిల్లా నుంచే జరుగుతాయని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. రాయచోటి పట్టణంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ప్రాజెక్టు) డైరెక్టర్ కార్యాలయాన్ని డీఆర్వో మధుసూదన్‌రావు ప్రారంభించారు. రాయచోటి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన మహిళా స్వశక్తి భవనంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు మెప్మా ప్రాజెక్టు నిర్వహణ కడప జిల్లా నుంచి సాగుతుండేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి మెప్మా కార్యక్రమాలు అన్నమయ్య జిల్లా నుంచే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రాయచోటి, మదనపల్లి, రాజంపేట మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


రాయచోటిలో మెప్మా ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

రాయచోటిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు పరీక్షా కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ జరుగుతున్నాయి. గురువారం 6 పరీక్షా కేంద్రాల్లో 1161 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1049 మంది హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

వర్గాలు వద్దు... అభివృద్ధి సాధిద్దాం

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో వర్గాలు లేకుండా అభివృద్ధి వైపు దృష్టి సారిద్దామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యిందని, ఈ ఏడాదిలో అటు సంక్షేమం ఇటు అభివృద్ధిలో ప్రపంచ స్థాయిలోనే మన రాష్ట్రం అగ్రగామిలో పయనించడం మనందరి అదృష్టమని ఈ సమయంలో వర్గాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి మనందరిని ఇబ్బందులకు గురి చేసిందన్నారు. మనందరం వర్గాలకతీతంగా ముందుకు సాగుదామన్నారు. నాయకత్వ బాధ్యత అన్నది సేవాభావంతో కూడుకున్నది తప్ప అదేమి కిరీటం కాదన్నారు. ఎవరూ ఎవరి నాయకత్వం కింద పని చేయాల్సిన పనిలేదని, మనందరం సమానమేనన్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాయకత్వంలో అందరం కలిసి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పేదలకు పంచి ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రాజంపేటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తదితరులు

అతడో మానవమృగం

- బాధితులకు అండగా ఉంటాం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిని చిదిమివేసి విగతజీవిగా మార్చి పొదల్లో పడవేసిన వ్యక్తి మనిషి కాదని అతడో మానవమృగమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. గత నెల 23వ తేదీ మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో మూడేళ్ల చిన్నారిపై కె.రహమతుల్లా అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేసిన సంఘటన తెలిసిందే. నిందితుడు ఈనెల 4వ తేదీన మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న చిన్నారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పరామర్శించారు. చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల చిన్నారిపై జరిగిన అఘాయిత్యం, ఆపై చోటు చేసుకున్న హత్య రాష్ట్రాన్ని కలచి వేసిందన్నారు. చిన్నారి ఫొటోలను చూస్తుంటే.. ఆ కుటుంబాన్ని ఎలా ఓదార్చాలి, ఏం ధైర్యం నింపాలో అర్థం కావడంలేదన్నారు. నిందితుడు తనంతట తాను శిక్షించుకున్నా.. న్యాయస్థానాలు శిక్షించినా బాధితులకు జరిగిన నష్టాన్ని పూడ్చలేమని పాపను తిరిగి తీసుకురాలేమని అన్నారు. సమాజంలో ఎలా బతకాలి, ఒకరినొకరు ఎలా గౌరవించుకోవాలి, నైతిక విలువలు, మానవత్వం తదితర అంశాలను విద్యతోపాటు పాఠశాలస్థాయి నుంచి పిల్లలకు నేర్పాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాధితులకు సుమారు నాలుగున్నర లక్ష చెక్కు అందించామని, త్వరలో మరో చెక్కు అందించనున్నామని చెప్పారు.


బాలిక తల్లిని ఓదార్చుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

కళ్లెదుటే కదులాడుతోంది

వచ్చీరాని మాటలతో పలకరిస్తూ నిత్యం తనతో ఉండే కూతురు ఇప్పటికీ కళ్ల ఎదుట కదులాడుతోందని తల్లి కన్నీటి పర్యంతమయ్యారు. పరామర్శించడానికి వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఎదుట బాధిత తల్లి తమ కూతురు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు. తనకు తల్లిదండ్రులు లేరని, తన బిడ్డలే తనకు సర్వమని, అల్లారుముద్దుగా పెంచుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ వారిని ఓదార్చి ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ డీసీటీవో సుభాష్, డీఎస్పీ భావన, తహశీల్దారు గంగయ్య, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ రాజు, ఐసీడీఎస్ రూరల్ సీడీపీవో అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలకు ఇక్కడే చదువు చెప్పండి

- పాఠశాలకు తాళం వేసిన గ్రామస్థులు
- తల్లిదండ్రులతో చర్చించిన డీఈవో

ఒంటిమిట్ట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలకు ఈ పాఠశాలలోనే చదువు నేర్పించాలని, దూర ప్రాంతాలకు వెళ్లరని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిన్నకొత్తపల్లెలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు తాళం వేసి గేటు ఎదుట బైఠాయించారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇక్కడే పాఠశాల ఉండగా ప్రస్తుతం ఐదో తరగతి వరకే ఇక్కడ పాఠశాల నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లాలంటే కష్టమన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 115 మంది విద్యార్థులు ఉన్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ ఉన్న తరగతులను తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపమని, టీసీలు కూడా తీసుకోమని తెలిపారు. విషయం తెలుసుకున్న కడప డీఈవో షంషుద్దీన్, డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి చిన్నకొత్తపల్లెకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చలు జరిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీ, తహసిల్దారు దామోదర్‌రెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు తాళం వేసి గేటు బయట బైఠాయించిన తల్లిదండ్రులు

టమోటా, మామిడి సాగు తగ్గించుకోవాలి

- అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ రాజా నాయక్

కలికిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా టమోటా, మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారని, ఇక ఈ పంటల సాగును తగ్గించుకుంటేనే శ్రేయస్కరమని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ రాజానాయక్ తెలిపారు. రెండు వారాల పాటు కేవీకే ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా గురువారం కేవీకేలో కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సమావేశంలో పాల్గొన్న ఒక అభ్యుదయ రైతు టమోటా, మామిడి సాగుతో కష్టాలెదుర్కుంటున్న రైతుల పరిస్థితి గురించి వివరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని కోరారు. దీనిపై ప్రొఫెసర్ రాజా నాయక్ స్పందిస్తూ ఎప్పుడో ఒకసారి టమోటాలో ఊహించనంత లాభాలు వస్తున్న కారణంగా రైతులు ప్రలోభానికి గురవుతున్నారని, ఇక మామిడి తోటలు కూడా విస్తారంగా విస్తరించడంతో మార్కెట్‌లో అనూహ్య ఒడిదుడుకులు ఎదురవుతున్నాయని వివరించారు. దీనికి పరిష్కారంగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ఆలోచించాలని తెలిపారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ 15 రోజులు 45 పంచాయతీల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. పలువురు వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఫీడ్‌బ్యాక్ తీసుకుని భారత వ్యవసాయ పరిశోధనా మండలికి నివేదించామన్నారు. తిరుపతి ఎస్వీ పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ గంగరాజు మాట్లాడారు. సమావేశంలో పలు ప్రాంతాల నుంచి హాజరైన వివిధ విద్యాలయాలు, సంస్థల నిష్ణాతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ వెంకటముని నాయుడు, డాక్టర్ నవీన్, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ సుధీర్, డాక్టర్ పుష్ప, ఇఫ్కో కో-ఆర్డినేటర్ దిలీప్, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఔత్సాహిక పారిశ్రామికవేత్త భారతి ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా నానో డీఏపీ పిచికారిని ప్రదర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

అందని ఉపాధి బిల్లులు

- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు
- రెండు నెలలుగా విడుదలకు నోచుకోని నిధులు
- బిల్లులు రాకపోవడంతో పనులకు వెళ్లని కూలీలు



రెడ్డివారిపల్లెలో ఉపాధి పని చేస్తున్న కూలీలు (ఫైల్)

గాలివీడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. ఒకప్పుడు వ్యవసాయమే జీవనాధారంగా ఉండే ఈ ప్రాంతంలో ప్రస్తుతం వ్యవసాయం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇక చేసేదేమీ లేక ప్రజలందరూ ప్రత్యామ్నాయ మార్గాలైన ఇతర పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అందులో ముఖ్యమైనది కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం. ఈ పథకం ద్వారా కొంత మేర ప్రజల జీవనం సాగుతున్నది. అయితే గత రెండు నెలలుగా చేసిన ఉపాధి పనులకు బిల్లులు పడకపోవ డంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బంది లను ఎదుర్కొంటున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక అప్పులు చేసి మరీ జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చేసిన పనులకు బిల్లులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కూలీలు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే...

జాతీయ ఉపాధి హామీ పథకం కరువు కాటకాలతో పేద ప్రజలను ఆదుకోవడానికి ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పిస్తున్నారు. ప్రతిరోజు పనిచేసినందుకు ఒక్కొక్కరికి రూ.300 కూలీని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఆర్థిక సంవత్సరం అనగా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఎప్పుడైనా వంద రోజులు కూలీలకు పని కల్పించాలి. అయితే ముఖ్యంగా వేసవి కాలంలో ఇతర ఎలాంటి పనులు ఉండవు కాబట్టి ఏప్రిల్, మే, జూన్ నెలలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ నెలలో ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభమైతే గత రెండు నెలల నుంచి కూలీలు చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు పడలేదు. మండలంలో 17 పంచాయతీలు కలవు. ప్రతి పంచాయతీలో వందల సంఖ్యలో కూలీలు పనులు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 15 వేలకు పైన జాబ్‌కార్డులు కలవు. ఏప్రిల్ నుంచి ప్రతిరోజు 6 వేల నుంచి 9 వేల వరకు కూలీలు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక లక్షకు పైన కూలీలు పనిదినాలు చేశారు. దాదాపుగా వీరందరికీ నాలుగు కోట్లకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. కానీ ఇంతవరకు డబ్బులు విడుదల కాలేదు. ఇదిలా ఉంటే రెండు నెలలుగా డబ్బులు పడకపోవడంతో కూలీలు అందరూ అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సి వస్తున్నది. గత రెండు నెలలుగా డబ్బులు పడకపోవడంతో కూలీలు కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు పోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి కూలీల డబ్బులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో కూలీల అకౌంట్‌లోకి డబ్బులు

- ఏపీవో హరిప్రసాద్

గత రెండు నెలలుగా కూలీలకు డబ్బులు పడని మాట నిజమే. కానీ తొందరలో చేసిన పనుల్లో అన్నింటికీ కూలీల అకౌం ట్‌లోకి డబ్బులు పడతాయి. కూలీలకు రావాల్సిన డబ్బులపైన ప్రభుత్వం తొందరలో విడుదల చేస్తున్నట్లు క్లారటీ కూడా ఇచ్చింది. కావున రెండు, మూడు రోజుల్లో కూలీలందరికీ డబ్బులు అందుతాయి.

రెండు నెలలుగా బిల్లులు పడలేదు

- రామిరెడ్డి, పూలుకుంట రెడ్డివారిపల్లె



ఈ సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చేసిన ఉపాధి పనులకు బిల్లులు పడలేదు. నేను ప్రతిరోజు ఉపాధి పనులకు వెళుతున్నాను. తనతో పాటు మా కుటుంబంలో ఇంకా ముగ్గురం వెళుతున్నాము. మా కుటుంబానికి రూ.35 వేలకు పైగా రావాల్సి ఉంది. కావున ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులకు సంబంధించి నిధులను విడుదల చేయాలి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పెద్దమండ్యం మండలాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడ్డారు. గురువారం మదనపల్లె మండలం రాయనచెరువు కురవపల్లెకు చెందిన గోవర్ధన్ ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతుండగా సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవర్ధన్ సహా ధనలక్ష్మి గాయపడింది. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం మండల కలిచెర్లకు చెందిన సాంబశివ (18), శ్రీకాంత్ (18), రెడ్డిశేఖర్ (35), శివకుమార్ (14), మదనపల్లెకు చెందిన దుర్గ (20) గుర్రంకొండ టమోటా మార్కెట్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు ఐదుగురు ప్రయాణికుల ఆటోలో కలిచెర్ల నుంచి గుర్రంకొండ టమోటా మార్కెట్‌కు వెళుతుండగా మార్గమధ్యలోని తురకపల్లె ఘాట్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురు గాయపడగా వీరిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా, పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఆరీఫుల్లా

పీలేరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పీలేరు-రాయచోటి జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరీఫుల్లా (40) అనే వ్యక్తి మృతి చెందాడు. కలకడకు చెందిన ఆరీఫుల్లా ద్విచక్రవాహనంపై వెళుతుండగా తిమ్మాపురం వద్ద కారు ఢీకొనడంతో అదే సమయంలో వెళుతున్న ఐషర్ వాహనం కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కేవీపల్లె ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీపల్లె ఎస్‌ఐ తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఈఈ రాజశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అరవపల్లెలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఆవరణంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సోలార్‌వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల వినియోగదారుడికి మేలు జరుగుతుందన్నారు. వీటి ఏర్పాట్ల వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. సబ్సిడీపై సోలార్ ఏర్పాటు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ బాలసుబ్రమణ్యం, తహసిల్దారు అమరేశ్వరి, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, మోడపోతుల రాము, ప్రజలు పాల్గొన్నారు.

ముంబై-చెన్నై జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో బొలెరోపై పడ్డ ఇనుప పైపులు, మృతి చెందిన రైతు రాజన్న, జాతీయ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

- ఇనుప పైపులతో వెళ్తున్న లారీని ఢీకొన్న బొలెరో వాహనం
- రైతు మృతి... ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- జాతీయ రహదారిలో 10 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్

ములకలచెరువు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలో గురువారం మధ్యాహ్నం ఇనుప పైపులతో వెళ్తున్న లారీని టమోటాలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో లారీలో ఉన్న ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడంతో ఓ రైతు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిలో ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల కథనం మేరకు... బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ పాత కురవపల్లెకు చెందిన రైతులు బగ్గల రాజన్న (55), రామచంద్ర (60) తాము పండించిన టమోటాలతో బొలెరో వాహనంలో ములకలచెరువు మార్కెట్‌కు వెళుతూ వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లె క్రాస్ వద్ద హైదరాబాదు నుంచి మధురైకు ఇనుప పైపులు తీసుకెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొనడంతో ఇనుప పైపులు బొలెరో వాహనంపై పడ్డాయి. దీంతో రైతు బగ్గల రాజన్న (55) వాహనంలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. మరో రైతు రామచంద్ర, డ్రైవర్ గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరసింహులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బొలెరోలో ఇరుక్కుపోయి మృతి చెందిన రైతు, మరో ఇద్దరిని ఎక్స్‌వేటర్ సహాయంతో అతికష్టం మీద బయకు తీయించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. లారీని ఢీకొన్న బొలెరో వాహనం రోడ్డుకు అడ్డంగా ఉండడంతో జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా 10 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. రోడ్డుకు అడ్డుగా ఉన్న బొలెరో, లారీని పోలీసులు ఎక్స్‌వేటర్‌తో పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. కాగా మృతుని కుటుంబీకులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

లారీని పక్కకు తీసేందుకు తప్పని ఇబ్బందులు

భారీ పరిమాణం గల ఇనుప పైపులు తీసుకెళ్తు రోడ్డు ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీని పక్కకు తీసేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బొలెరో ఢీకొన్న సమయంలో లారీ పక్కకు తప్పించబోయే క్రమంలో ముందు భాగం దెబ్బతిని రెండు చక్రాలు ఊడిపోయాయి. రెండు ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడం, మరో నాలుగు పైపులు లారీలోనే ఉండిపోయాయి. దీంతో జాతీయ రహదారికి అడ్డుగా ఉన్న లారీని పక్కకు తీసేందుకు వీలు కాలేదు. ఈ నేపథ్యంలో లారీలో ఉన్న మిగిలిన ఇనుప పైపులు ఎక్స్‌కవేటర్‌తో కిందకు దింపారు. లారీని రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో పక్కకు తీశారు.

టీడీపీ నేత హోటల్ ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు



దాడిలో ధ్వంసమైన హోటల్ సామగ్రి

పీలేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు, అతడి కుమారులు, వారి స్నేహితులు తన భర్తను హతమారుస్తామంటూ బెదిరిస్తున్నారని టీడీపీ నేత పులిచెర్ల మహేశ్ సతీమణి రజని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త కాలికి తగిలిన గాయానికి చికిత్స కోసం తాను, తన భర్త బుధవారం ఉదయం పీలేరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కారు పక్కకు పెడుతుండగానే సెక్యూరిటీ గార్డు ధరణి తన భర్తను దుర్భాషలాడడమే కాకుండా తన్నేందుకు కాలు ఎత్తాడని ఆరోపించారు. అదే సమయంలో తన భర్త కారు డోరు తీయడంతో అతను కిందపడిపోయాడన్నారు. అయితే చికిత్స అత్యవసరం కావడంతో తాను తన భర్తను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి ధరణి వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లానన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ధరణి, అతడి కుమారులు, వారి స్నేహితులు తనపై దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. అంతే కాకుండా బుధవారం రాత్రి వారు తమ ఇంటి వద్దకు కొడవళ్లు, ఇనుప రాడ్లతో వచ్చి తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. అంతటితో ఆగకుండా స్థానిక హెరిటేజ్ ఫ్యాక్టరీ ఎదుట జీవనోపాధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న చికెన్ సెంటర్, హోటల్‌ను పూర్తిగా ధ్వంసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను, తన భర్తను కాపాడాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్ ఆమెకు తెలియజేశారు.

రైతుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

రాజంపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. గురువారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేయడం, పిచికారీ మందులు సరఫరా చేయడం ఇలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా పెద్దఎత్తున పంటలను పండించడం బీజేపీ చొరవేనన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, బీజేపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు, కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, గ్రామ కమిటీల రాయలసీమ ఇన్‌చార్జి శరత్‌కుమార్, క్రిష్ణయాదవ్, మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మనోహర్ గౌడ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో బోరు తవ్వకం

- అడ్డుకున్న బాధితులు..పోలీసుల ప్రవేశం



వివాదాస్పద భూమిలో బోరులారీని అడ్డుకున్న బాధితులు, సర్దిచెబుతున్న పోలీసులు

మదనపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రెండు వర్గాల మధ్య కొన్నేళ్లుగా వివాదంలో ఉన్న భూమిలో బోరు తవ్వకానికి వెళ్లిన వారిని బాధితులు అడ్డుకున్నారు. భూమి తమదిగా చెబుతున్న ఆ వర్గం పోలీసులతో పాటు భూమిలోకి వెళ్లారు. ఈ క్రమంలో బాధితులను అడ్డుకుని, బోరుబండిని వివాదాస్పద భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. చివరకు బాధితులు ప్రతిఘటించడంతో పోలీసులు సహా వారంతా వెనక్కి వెళ్లాల్సివచ్చింది. బి.కొత్తకోట మండలం బోదలవారిపల్లె వాసులు గుడే వెంకటశివకు, మరొకరి మధ్య ఐదేళ్లుగా భూవివాదం నడుస్తోంది. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె రెవెన్యూ గ్రామం సర్వేనంబరు 697-2లో 4.90 ఎకరాల భూమి వుంది. ఈ భూమిని మదనపల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులకు ప్రభుత్వం డీకేటీ పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. అనంతరం ఈ భూమిని బోదలవారిపల్లెకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటికే ఉత్తన్న కుమారుడు జి.వెంకటశివ 40ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఎండార్స్‌మెంట్‌లో పేర్కొన్నారు. అయితే తమకు పట్టా ఇచ్చినట్లు చెబుతున్న మదనపల్లెకు చెందిన ముగ్గురు మరొకరికి భూమిని విక్రయిస్తే ఎలా చెల్లుతుందని బాధితులు వాపోతున్నారు. ఇదిలావుండగా, వివాదాస్పద భూమిలో బోరు వేయడానికి ఓ వర్గం, బోరు బండితో గురువారం భూమిలోకి వెళ్లగా బాధితులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఈక్రమంలో వెంకటశివ వర్గాన్ని పోలీసులు బలవంతంగా పోలీసు జీపులోకి ఎక్కించడానికి ప్రయత్నించగా, అడ్డుకున్నారు. వివాదంలో ఉన్న భూమిలోకి పోలీసులు ప్రవేశించడం ఏంటని ప్రశ్నించడంతో చివరకు అక్కడి నుంచి వారంతా వెళ్లిపోయారు. ఇదిలావుండగా, అసైన్‌మెంట్ పట్టా అన్యాక్రాంతం అయిందనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు పీఓటీలో పెట్టినట్లు చెబుతున్నారు. పట్టణానికి చెందిన వ్యక్తులు బోదలవారిపల్లెకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి విక్రయించడంతో పోలీసుల సహకారంతో తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వివాదం నేపథ్యంలో అక్కడికి రెవెన్యూ అధికారులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వెనుదిరిగి వచ్చేశారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

కలకడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువకుడు తౌనిక్‌అలీ కిడ్నాప్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆర్థిక లావాదేవీలపై కలకడకు చెందిన తౌనిక్‌అలీని రాయచోటికి చెందిన అతడి బంధువు ఖాజా మంగళవారం కిడ్నాప్ చేసిన విషయం విదితమే. తౌనిక్‌అలీని మట్టుబెట్టాలని ఖాజా అతడి అనుచరులు సుహేల్, షబ్బీర్, అక్రమ్, మహ్మద్‌హుసేన్, ఫాజిల్ సహాయం తీసుకొన్నట్లు తెలిపారు. దీనికోసం బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాల్లో కలకడకు వచ్చి తౌనిక్‌అలీని రాయచోటికి తీసుకెళ్లి దారుణంగా కొట్టినట్లు తెలిపారు. దర్యాప్తు వేగవంతం చేసి మండలంలోని కోన క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండు నిమితం వాల్మీకిపురం కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్లాస్టింగ్ చేసే గంట ముందు హెచ్చరికలు చేయాలి

- డీడీఎంఎస్ అధికారి కిశోర్‌కుమార్



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న డీడీఎంఎస్ అధికారి

ఓబులవారిపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీలో బ్లాస్టింగ్ చేసే సమయంలో ఒక గంట ముందు హెచ్చరికలు జారీ చేయాలని దీంతో సమీప ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటారని నెల్లూరు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) అధికారి కిశోర్‌కుమార్ తెలిపారు. ఏపీఎండీసీ మైన్స్ మంగంపేట పరిధిలో ఉన్న పంట పొలాల్లో పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని అందిన ఫిర్యాదు మేరకు నెల్లూరు డీడీఎంఎస్ అధికారి కిశోర్‌కుమార్ గురువారం ఇక్కడికి వచ్చి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మైనింగ్ వల్ల తమ పంటలకు, పశువులకు ప్రమాదం ఉందని, తమ పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని తెలుపగా బ్లాస్టింగ్ చేసే సమయానికి సుమారు గంట నుంచి ఆ పరిసర ప్రాంతాల్లో హెచ్చరికలు చేస్తూ వెళ్లాలని దీనివల్ల ఇటు సంస్థకు అటు ప్రజలకు నష్టం జరగకుండా ఉంటుందని ఆయన ఏపీఎండీసీ అధికారులకు తెలిపారు. రైతుల రాకపోకలకు, వారి భద్రతకు ఆస్తి, ప్రాణ, పంట నష్టాలు జరగకుండా మైనింగ్ నిర్వహించాల్సిన బాధ్యత ఏపీఎండీసీపై ఉందని ఏపీఎండీసీ అధికారులు సుదర్శన్‌రెడ్డి, గోపినాథ్‌లకు తెలిపారు. అలాగే పలు అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మంగంపేట గ్రామస్థులు, గునిపాటి చెన్నరాయుడు, గునిపాటి వేణుగోపాల్, కొటారు సుబ్రమణ్యం, పోతుల లక్ష్మీనారాయణ, కౌలూరి సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోండి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలియచేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

రాజంపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, సంస్థ ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గాలి చంద్ర, జిల్లా కార్యదర్శి సికిందర్, ఆటోవర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం రాజంపేట ఆర్‌అండ్‌బీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీలు ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగిస్తోందని ఆరోపించారు. 1200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో తొలగించారన్నారు. ఇప్పుడు మరో 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి జాబితాను సిద్ధం చేశారన్నారు. తమ ఉద్యోగాలను రక్షించుకోవడం 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేయాల్సిన స్థితి యాజమాన్యం కల్పించదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహ, మహమ్మద్, సుబ్రమణ్యం, నన్నేసాహెబ్, వెంకటప్ప, వెంకటస్వామి, ఎస్.రమణ, గోవిందు, ఆటో యూనియన్ నాయకులు సాయి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

దొంగ ఫొటో విడుదల



బ్రాందీ షాపులో చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

సిద్దవటం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శ్రీకృష్ణ వైన్‌షాపులో జరిగిన చోరీ సంఘటనలో దొంగ ఫొటో విడుదల చేస్తున్నామని, ఎవరైనా ఈ ఫొటో గుర్తు పడితే 9121100581, 9121100584 నంబర్లకు సమాచారం తెలపాలని ఎస్‌ఐ మహమ్మద్ రఫి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు...శ్రీకృష్ణ వైన్‌షాపులో జూన్ 2న మద్యం, నగదు చోరీకి గురైంది. చోరీ చేసిన వ్యక్తి ముఖానికి మద్యం, అట్టముక్కలు అడ్డం పెట్టుకుని చాకచక్యంగా చోరీ చేశాడు. సిద్దవటం, భాకరాపేట, పోలీసులైన్ క్రాస్ వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించామని ఎస్‌ఐ వివరించారు.

మూన్నాళ్ల ముచ్చటగా... పెళ్లి బంధం



మాంగల్యం తంతునాం.. మమ జీవన హేతునాం. అంటూ వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మూడు ముళ్లు వేసి.. అగ్ని సాక్షిగా పెళ్లిళ్లు చేసుకుంటున్నా.. అది మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది.. ప్రస్తుతం యువత పెళ్లి జరిగిన నెలల వ్యవధిలో కొందరు.. మరికొందరు పెళ్లి తంతు జ్ఞాపకాలను నెమరు వేసుకునే లోపే బంధాలను తెంచేసుకుంటున్నారు. అయితే వీరు విడిపోవడానికి అంత బలమైన కారణాలు కూడా ఉండటం లేదు. చిన్న చిన్న మనస్పర్థలతో పంతా లకు పోయి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. వీరికి సర్ది చెప్పాల్సిన కొంత మంది తల్లిదండ్రులు తమ బిడ్డలను వెనకేసుకు వస్తుండడంతో కాపురాలు కూలిపోతున్నాయి.

- చిన్నచిన్న కారణాలతో విడిపోతున్న దంపతులు
- పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్న జంటలు
- జంటలను కలిపేందుకు పోలీసుల యత్నం

కడప (క్రైం), జూన్ 12: పెళ్లి అంటే తెంచుకుంటే తెగిపోయే బంధం కాదు.. జన్మజన్మల బంధం అని పెద్దలు చెబుతారు. అయితే ప్రస్తుత హైటెక్ యుగంలో పెళ్లి బంధం మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. కాళ్ల పారాణి ఆరకముందు కటీఫ్ చెబుతున్నారు. చిన్న చిన్న కారణాలకే వెనక ముందు ఆలోచించకుండా దంపతులు విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో నిండు నూరేళ్ల అన్యోన్యంగా కలిసి జీవించాల్సిన జంటలు ఎవరి దారి వారిది అన్నట్లు విడిపోతున్నారు. ఇలా ఇటీవల కాలంలో వందల జంటలు ఈ బాట పడుతున్నాయి.

టెక్నాలజీ ఎంత వేగంగా పెరుగుతోందో అంతే వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. భార్య భర్తల మధ్య అహం.. అపార్థం, అనుమానాలు.. ఒకరిపై ఒకరికి ఆపసమ్మకాలతో విభేదాలు వస్తున్నాయి. నాలుగు గోడల మధ్య సర్దుకుపోవాల్సిన బంధాలు చాలా వరకు రోడ్డున పడుతున్నాయి. చిన్న సమస్యలకు కూడా భార్యభర్తల మధ్య అగాధం పెరిగి చివరికి విడిపోయేందుకు సిద్ధమై పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు...ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి పరిస్థితి కూడా మూన్నాళ్ల ముచ్చటగా తయారవుతోంది. క్షణికావేశంలో పంతాలకు పోయి బంధాలను తెంచుకుంటున్న దంపతుల ప్రభావం వారి పిల్లలపై కూడా చూపుతోంది.

ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో..

ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కరువు అవుతున్నాయి. ఉద్యోగాలు, చదువులు, వ్యాపార రిత్యా పెళ్లైన కొత్త జంటలు ఒంటరిగా ఉండాలని కోరుకుంటున్నారు. తల్లిదండ్రులకు, అత్త మామలకు దూరంగా కొత్త కాపురాలు పెడుతున్నారు. దీంతో మంచి చెడు చెప్పేవారు లేక పెళ్లైన కొన్ని రోజులకే భార్యభర్తల మధ్య విబేధాలు వస్తున్నాయి. సర్దుకుపోయి కాపురాలు చేసుకోవాలని చెప్పేవారు లేక పోలీసు స్టేషన్‌ల మెట్లు ఎక్కుతున్నారు.



దంపతులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ యల్లమరాజు

కలిపేందుకే ప్రాధాన్యత...



చిన్న చిన్న మనస్పర్థలతో విడిపోయేందుకు పోలీస్ స్టేషన్‌కి వచ్చే దంపతులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. జంటలను కలిపేందుకే సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తున్నాం. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారు కూడా పోలీస్ స్టేషన్ గడప ఎక్కుతున్నారు. భార్యభర్తలు సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని నచ్చ చెప్పి పంపుతున్నాం.

-బాల స్వామిరెడ్డి, డీఎస్పీ, కడప మహిళ పోలీస్ స్టేషన్

ప్రేమ పెళ్లిళ్ల పరిస్థితి అంతే...

ఏళ్ల తరబడి ప్రేమించుకోవడం, తరువాత పెద్దలు ఒప్పుకోలేదంటు కొందరు పారిపోయి పెళ్లి చేసుకుంటున్నారు. పెళ్లి అనంతరం వారిజీవనానికి తగినంత సంపాదన లేకపోవడం, రాజీపడి జీవించలేకపోవడంతో దంపతుల మధ్య విబేధాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి దారు చిన్నచిన్న ఘటనలను కూడా పోలీసు స్టేషన్ల మెట్లు ఎక్కి, విడిపోయేందుకుసిద్ధమవుతున్నారు. ఇలాంటి వారు ఇటీవల ఎక్కువగా కనబడుతున్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన విద్యార్థులు

కడపస్పోర్ట్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీ ల్లో కడప జిల్లా ద్వితీ య ఛాంపియన్ షిప్ సాధించిందని తైక్వాండో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఇందులో సబ్ జూనియర్, కేడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో జిల్లా నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో 12 మంది బంగారు, 14 మంది రజత, 12 మంది కాంస్య పతకాలు సాధించారన్నారు. ఇందులో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉత్తరాఖండ రాష్ట్ర హరిద్వార్‌లో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కాగా పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ట్రెజరర్ సలీం క్రీడాకారులను అభినందించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

దేనేపల్లిలో ఘటనలపై డీఎస్పీ ఆరా



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ముద్దనూరు జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి దేనేపల్లి గ్రామంలో జరిగిన వ్యక్తిపై గొడ్డలితో దాడి, మహిళపై లైంగిక వేధింపుల కేసులకు సంబంధించి గురువారం డీఎస్పీ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంగళ వారం దేనేపల్లి గ్రామంలో బోల రామ్మోహనపై గొడ్డలితో జరిగిన దాడి, అదే గ్రామంలో ఓ మహిళపై జరిగిన లైంగిక వేధింపులకు సంబం ధించి పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదైన విషయం విధితమే. వాటికి సంబంధించి డీఎస్పీ పొలం వద్దకు వెళ్లి ఘట నలకు గల కారణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగిన వ్యక్తి మృతి

కాశినాయన జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు.. మండలంలోని కొండ్రాజుపల్లెకు చెందిన కుమారి రమణయ్య (52)కు వ్యవసాయంలో వరుస నష్టాలు రావడం, మరోవైపు అనారోగ్యం వేధిస్తుండడంతో అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 10వ తేదీ మంగళవారం విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



జమ్మలమడుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో చాకలి అంకాళయ్య (35) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. మృతుడు మోరగుడి గ్రామంలో అద్దకపు బట్టీల వద్ద చీరెలకు, నూలు వస్త్రాలకు రంగులు వేసే కూలి పనులకు వెళ్లేవాడన్నారు. గురువారం మద్యం అతిగా తాగి అనారోగ్యాని కి గురవడంతో బంధువులు 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

24 గొర్రెలు అపహరణ

దువ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణ పల్లెలో 24 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఈమేరకు బాధితుడు సుబ్బరాజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలంలోని కలం దొడ్డిలో ఉంచిన గొర్రెలను రాత్రివేళ వాహనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు నమోదు అయ్యాయని.. పోలీసులు నిందితులను పట్టుకుని న్యాయం చేయాలని గొర్రెల యజమాని కోరారు.

చెట్టుపడి హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

ఖాజీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామం వద్ద గురువా రం చెట్టు విరిగిపడటంతో హెడ్ కానిస్టేబుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు... బద్వేలు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య వృత్తి నిమిత్తం ఖాజీపేట నుంచి వెళుతుండగా ఆంజనేయకొట్టాలు సమీపంలోకి రాగానే చెట్టు విరిగిపడింది. దీంతో కొమ్మలు ఆయనపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స కోసం కడపకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట దీక్షల నుద్దేశించి మాట్లాడుతున్న సుభాషిణి

కడప మారుతీనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన హామీల్లో భాగంగా గ్రాట్యుటీ కింద రూ. 1.50 వేలు, మెటర్నిటీ సెలవులు మూడు నెలలుగా ప్రకటించినా ఇంత వరకు జీవోలు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లగా ఆశా కార్యకర్తలకు పెండింగులో ఉన్న లెప్రసీ మొత్తాన్ని ఇవ్వాలని పలు రూపాల్లో ఆందోళనలు చేపట్టినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. లెప్రసీ అలవెన్స్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ ఆశాలకు ఇవ్వకుండా ప్రభుత్వానికి తిరిగి వెనక్కు పంపించామని అధికారులు చెప్పడం దారుణమన్నారు. తక్షణమే లెప్రసీ మొత్తాన్ని తెప్పించి ఆశాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మరియమ్మ, కల్పన, శాంతమ్మ, నరసమ్మ, అమ్ములు, శోభారాణి, ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, మద్దిలేటి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మాహుతికి యత్నించిన వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు భరించలేక ఆత్మాహుతికి యత్నించిన కడప జిల్లాకు చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కడప జిల్లా చిలమకూరు గ్రామానికి చెందిన నగనూరు వెంకటసుబ్బయ్య(44) తిరుపతి అత్తులూరి ట్రస్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆర్థిక, ఇంట్లో సమస్యలతో జీవితంపై విరక్తి చెంది గ్రీన్‌పార్కు అపార్టుమెంటు సమీపంలోని ఖాళీ స్థలంలో మంగళవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అత్తులూరి ట్రస్టులో పనిచేస్తున్న అతని సమీప బంధువు మేనేజర్ వెంకటేశ్వర్లు విషయం తెలుసుకుని అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి సమిష్టిగా కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న యోగ సాధకులు, అధికారులు

కడప క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి అన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి తమవంతు కృషి చేస్తామని యోగా సాధకులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిన బూనారు. గురువారం ఉదయం శిల్పారామంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచనల మేరకు వన్‌ఎర్త్- వన్ హెల్త్ కార్యక్రమ వేదికపై ఈగల్ (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంటు) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఏపీ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ ఎస్.మురళీబాబు, జిల్లా పర్యాటక అధికారి సురేశ్‌కుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు : చైర్మన్




నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ఐఎంపీఎస్ సేవలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

కడప రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌తో పాటు ఐఎంపీఎస్ సేవలను గురువారం నుంచి అం దుబాటులోకి తెచ్చినట్లు డీసీసీబీ చైర్మన్ ఎం.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం డీసీసీబీ కార్యాలయంలో బోర్డు మీటింగ్‌ను నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు ఖాతాదారుడు ఒక లక్ష వరకు చెల్లింపును మిగతా బ్యాంకులకు గానీ, డీసీసీబీకి గానీ నిమిషం లోపు చెల్లించే వీలు కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈవో వెంకటసుబ్బయ్య, ఆప్కాబ్ డైరక్టర్ రాంబాబునాయక్, నాబార్డ్ డీడీఎం విజయ్‌విహారి, ఈసీవో రాజామణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తోరణాలు, జెండాలు పీకి కాల్చివేత

- మరోమారు పోలీస్‌స్టేషన్‌కు చేరిన వ్యవహారం



టీడీపీ తోరణాలను రోడ్డు పక్కన పడేసి నిప్పుపెట్టిన దృశ్యం

పులివెందుల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రింగురోడ్డులో సర్కిళ్లలో ఉన్న టీడీపీ తోరణాలను, జెండాలను కొందరు యువకులు పీకేసి రోడ్డు పక్కనపడేసి నిప్పుపెట్టారు. ఈ వ్యవహారం కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...గురువారం సాయంత్రం కొంతమంది యువకులు రింగురోడ్డులో టీడీపీ మహానాడు కార్యక్రమం జరిగే సమయంలో తోరణాలు, జెండాలను ఏర్పాటు చేశారు. వీటిని ఇద్దరు ముగ్గురు యువకులు పీకి రోడ్డు పక్కన పడేసి నిప్పుపెట్టి తగులబెట్టారు. దీన్ని మొబైల్‌లో వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయం టీడీపీ నాయకులకు తెలిసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇటీవల కడపలో జరిగిన టీడీపీ మహానాడు కార్యక్రమం సందర్భంగా పులివెందులలోని రింగ్ రోడ్ల కూడళ్లలో ఏర్పాటు చేసిన తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీల పీకేసిన ఘటనలో 13 మంది పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ వ్యవహారం జరిగి సమస్య ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్న సమయంలో కొందరు యువకులు గురువారం తోరణాలు తొలగించి రోడ్డుసైడు పడేసి నిప్పుపెట్టడంతో మళ్లీ సమస్య జఠిలమైంది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



పులివెందులలోని రింగురోడ్డు కూడలిలో టీడీపీ జండాలను తొలగిస్తున్న యువకుడు

ప్రజలు మెచ్చిన పాలనకు ఏడాది

● రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో టీడీపీ సంబరాలు




రైల్వేకోడూరు: కేక్ కత్తిరించి సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు... సిద్దవటం: సంబరాల్లో పాల్గొన్న నాయకులు



నందలూరులో కూటమి నేతల సంబరాలు



లక్కిరెడ్డిపల్లెలో నాయకుల సంబరాలు



సుండుపల్లె: సంబరాల్లో కూటమి నేతలు



సంబేపల్లెలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు



చిట్వేలి: నక్కలపల్లెలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న నాయకులు



ఓబులవారిపల్లె: కేక్‌ను కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు మెచ్చిన పాలనకు ఏడాది పూర్తయిందని టీడీపీ యువ నాయకుడు ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి అన్నారు. కూటమి గెలుపును ప్రతి కార్యకర్తకు అంకితం చేస్తున్నామన్నారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయ ఆవరణం లో కేక్ కత్తిరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతికార్యకర్తా అంకితభావంతో పనిచేశారని గుర్తు చేశారు. వచ్చే నాలుగేళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపతామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, మలిశెట్టి మురళీధర్‌గౌడు, కట్టా బాలాజీ పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

లీగల్‌సెల్ ఆధ్వర్యంలో...

రాజంపేట నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలోను, సంక్షేమంలోను ముందుకు సాగుతోందన్నారు.

సుండుపల్లె : కూటమి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు ప్రసాద్ బాబు, మోహన్‌బాబునాయుడు, బెల్లాల రమణయ్య, బేరిపల్లి శ్రీధర్, జనసేన మండల మహిళా నాయకురాలు రెడ్డిరాణి, బీజేపీ మండల అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం చెన్నంశెట్టిపల్లెలో సుండుపల్లె గ్రామ అధ్యక్షుడు సుబ్బరామయ్య ఆహ్వానం మేరకు ఆయన విందు కార్యక్రమానికి హాజరయ్యారు.

నందలూరు: టీడీపీ మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో కూటమి ఏడాది పాలన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ యద్దల సుబ్బరాయుడు కేక్‌ను కత్తిరించి వేడుకలు జరుపుకున్నారు.

ఒంటిమిట్ట: పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కేక్‌ను కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. నాయకులు ఎంవీ రమణ, న్యాయవాది రామదాసు, చెరువు సంఘం అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి, పత్తి సుబ్బరాయుడు, మౌలాలి, కోనరాజుపల్లె బాషా, నరసింహులు, కత్తి అయ్యావారయ్య, కత్తి చంద్ర, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేశారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యవర్గ కార్యదర్శి ఓబునేని సుబ్బమ్మ, పార్టీ సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, ఎంపీపీ ప్రతినిధి నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునెయ్య, మోదుగుల నరసింహులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: కూటమి నాయకులు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఇంటివద్ద సంబరాలు చేసుకున్నారు. రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, విశాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

లక్కిరెడ్డిపల్లె: తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తోపురెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యం లో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకటరామరాజు, మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ముక్తార్, కావలి ఆంజనేయులు, మసూద్, జేకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని పలు గ్రామాల్లో కూటమి పార్టీల నాయకులు సంబరాలు జరుపుకున్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, శ్రీరామ సుబ్బయ్య, ఎన్.రాంప్రసాద్‌నాయుడు, బీఎల్ నరసింహారెడ్డి, కె.బాలక్రిష్ణ, జి.రంగారెడ్డి, షామీర్, సర్పంచ్ ఎర్రి శివ, క్లస్టర్ ఇన్‌చార్జి పి.రవికుమార్, దాసరి దామోదర్ నాయుడు, కె.సుదర్శన్ చౌదరి, కేఎన్ఆర్, సురేష్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, నరసింహనాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసనాయుడు తమ ప్రాంతాల్లో కేక్ కత్తిరించి విజయోత్సవాలు జరుపుకున్నారు.

సంబేపల్లె: టీడీపీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్య యాదవ్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, మాజీ సర్పంచులు శశిధర్‌రెడ్డి, వెంకటయ్య, గోపాల్, మండల మైనార్టీ అధ్యక్షుడు మునాఫ్, ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామాపురం: రామాపురంలో నిర్వహించిన సంబరాల్లో టీడీపీ మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, గాలివీటి సురేందర్‌రెడ్డి, ఆగ్రో వెంట్రామిరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, అంజనారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రామకృష్ణగౌడ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు వెంకట్రమణలు పాల్గొన్నారు.

సిద్దవటం: టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతిమోహన్‌రెడ్డి సిద్దవటంలో కేక్ కట్‌చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, మాజీ మార్కెట్ చైర్మన్‌లు మల్లు సంజీవరెడ్డి, జవహర్‌బాషా, మాజీ మండల టీడీపీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రుడు పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేటలో కేక్ కట్‌చేశారు. అలాగే రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకులు కాకర్ల చంద్రశేఖర్‌నాయుడు, ముమ్మినేని విజయ్‌కుమార్ చౌదరి, వెంకటసుబ్బయ్యయాదవ్, ఆరె జనార్దన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.




ఒంటిమిట్ట: కేక్ కట్‌చేస్తున్న ఎస్వీ రమణ... కేక్ కట్‌చేస్తున్న ఓబినేని సుబ్బమ్మ





పెనగలూరు కాకర్లవారిపల్లెలో సంబరాలు... రామాపురం, పుల్లంపేటలో కేక్‌ను కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూన్12(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని బోనమల గ్రామం కంకటివాండ్లపల్లిలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి రూ.20 వేలు అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ

చిన్నమండెం, జూన్12(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదవుకుంటున్న విద్యార్థులకు స్కూల్ కిట్లు (బ్యాగులు, పుస్తకాలు, పెన్సిళ్లు, వాటర్ బాటిల్స్)ను రాష్ట్ర రవాణా యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి పంపిణీ చేశారు. పిల్లల విద్యాభివృద్ధికి మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నిశ్చల్‌నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆయన సేవలను ప్రశంసించారు.

ప్రతి ఉద్యోగి ప్రజల్లో గుర్తింపు పొందాలి



శ్రీరాములును సన్మానిస్తున్న పోస్టాఫీసు సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో సేవలందించి ప్రజల్లో గుర్తింపు పొందాలని పలువురు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె సబ్‌పోస్టు మాస్టర్ శ్రీరాములు, పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్న హరినాథ్‌కు సబ్‌పోస్టాఫీసులో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు.బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, సబ్‌పోస్టుమాస్టర్ రమేశ్, కృష్ణ, రామయ్య, దేవ, గంగధర్, హరిస్వామి, న్యాయవాది చెన్నక్రిష్ణయ్య పాల్గొన్నారు.

నేడు సోలార్ రూఫ్‌పై అవగాహన

రైల్వేకోడూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం గ్రామంలో ఉన్న విద్యుత్ ప్రధాన కేంద్రం వద్ద శుక్రవారం సోలార్ రూఫ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు విద్యుత్ శాఖ ఏడీ భాస్కర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకునేందుకు రుణం ఎలా పొందాలి, ఎలా ఏర్పాటు చేసుకోవాలి అనే విషయమై ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సోలార్ ఏజెన్సీలు హాజరు కావాలన్నారు.

సోలార్ విద్యుత్‌పై సందేహాలు తీర్చుకోండి

పుల్లంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్‌పై ప్రజలకు గల సందేహాలు తీర్చేందుకు శుక్రవారం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో సాయంత్రం నాలుగు గంటలకు అవగాహన కల్పిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కుమార్ తెలిపారు. ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సందేహాలను నివృత్తి చేస్తారని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రభుత్వం లబ్ధిదారులకు సబ్సిడీ అందిస్తుందని పేర్కొన్నారు.

వైసీపీ శవరాజకీయాలు చేయడం దుర్మార్గం: టీడీపీ

రాయచోటిటౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు శవరాజకీయాలు చేయడం దుర్మార్గమని, తెలుగుదేశం పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, 20వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు మదన్‌మోహన్ హితవు పలికారు. గురువారం వారు మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాయచోటి పట్టణ శివార్లలో మిట్టావాండ్లపల్లెలో ఇటీవల ఒక మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణాలతో ఆ బాలిక ఈ దారుణ నిర్ణయం తీసుకున్నప్పటికీ దానిని తెలుగుదేశం పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం వైసీపీ శ్రేణుల శవ రాజకీయాలకు నిదర్శనమన్నారు.

పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరం



బాలకార్మిక నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గాలివీడు, జూన్12(ఆంధ్రజ్యోతి): 14 సంవత్సరాల లోపల పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని మండల విద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పక్కీరెడ్డిగారిపల్లెలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక చట్టం ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, ప్రమాదకరమైన పనుల్లో ఉపయోగించడం పని చేయించడం నేరం కావున బడిలో చదువు కోవాల్సిన వయస్సులో పిల్లలతో పని చేయించడం నేరం కావున పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలని చదువు ద్వారానే పిల్లలు అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. కలందర్, న్యాయవాది కిరణ్‌కుమార్, పోలీసు గుణపతిరాజు సిబ్బంది, రెడ్స్ ఇబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు బాలికల ఎంపిక

నందలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు క్రికెట్ సబ్‌సెంటర్ నుంచి నలుగురు బాలికలు ఎంపికయ్యారు. విభ స్కూల్‌కు చెందిన పూర్విజ, గిప్సిత, కేంద్రీయ విద్యాలయం రాజంపేటకు చెందిన పర్షిత, యశస్విని ఎన్నికయ్యారు. వీరు స్థానిక సబ్‌సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫిరోజ్‌ఖాన్ లోడి, ఫిట్‌నెస్ ట్రైనర్ శివకోటి వద్ద మెరుగైన శిక్షణ పొంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని విభ ఎరుడైట్ పాఠశాల కరస్పాండెంట్ జయభాస్కర్‌రావు, కేంద్రీయ విద్యాలయానికి చెందిన పీఈటీ రాహుల్ అభినందించారు. సబ్‌సెంటర్ నిర్వహణకు కృషి చేస్తున్న సీఏవైడీ ప్రెసిడెంట్ భరత్‌రెడ్డికి, సెక్రటరీ రెడ్డి ప్రసాద్, డీసీవో ఖాజామైనుద్దీన్‌లకు, సీఏవైడీ మెంబర్స్‌కు శిక్షణ పొందుతున్నవారు కృతజ్ఞతలు తెలిపారు.

'టీడీపీ ఇన్‌చార్జ్‌పై అసత్య ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

రైల్వేకోడూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిపై అసత్య ఆరోపణలు సరికాదని టీడీపీ రైల్వేకోడూరు మైనార్టీ నాయకులు పఠాన్ మౌలా, జుబేర్ పేర్కొన్నారు. గురువారం మైనార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కొందరు దళితులను ప్రేరేపించి ఈద్గా స్థలంపై అపోహలు సృష్టిస్తున్నారన్నారు.మైసూరివారిపల్లె పరిధిలో ప్రభుత్వ స్థలం ఉందని, అందులో కొంత భాగాన్ని ఈ ద్గాకు కేటాయించారన్నారు. భూమి చదనులో భాగంగా ఆక్రమణలో ఉన్న స్థలాన్ని కూడా చదును చేశారని, అయితే కొందరు నాయకులు కుట్రపన్ని దళితులను ప్రేరేపించి అబాండాలు వేయడం సరికాదన్నారు.

ఉద్యానవన శాఖాధికారిణిగా సింధూరి

లక్కిరెడ్డిపల్లె, జూన్12(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణిగా సింధూరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కడప ఉద్యానవనశాఖలో పనిచేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లెకు విచ్చేశారు. లక్కిరెడ్డిపల్లెలో పనిచేస్తున్న నాగమణి రాయచోటికి బదిలీ అయ్యారు.

'ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం'

రాయచోటిటౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినప్పటికీ చేసిన అభివృద్ధి శూన్యం అని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్ల టెండర్ల పిలిచి మిగిలిన జిల్లాలో ఎలాంటి అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు.

పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన గొంతు మూగబోయిందని, ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయారని ఎద్దేవా చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, వైసీపీ నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన విద్యార్థి మిత్ర కిట్లు

● తొలిరోజే విద్యార్థులకు అందజేత




ఎంఆర్‌సీలో విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు... యూనిఫాం

సంబేపల్లె, జూన్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను తొలిరోజే అందించినట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యాప్తంగా 75 పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలతో విద్యార్థి మిత్ర కిట్లను అందించినట్లు తెలియజేశారు. సంబేపల్లె మండలానికి 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు 18,245 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. పిల్లలకు సమదుస్తులు కూడా వచ్చాయన్నారు. మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలు 13, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 47, ఫౌండేషన్ ప్రైమరీ పాఠశాలలు4, ఉన్నత పాఠశాలలు 10 ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన కిట్లను ఇప్పటికే పాఠశాలలకు అందించి తొలిరోజే పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థి మిత్ర కిట్‌లు అందజేత

సంబేపల్లె, జూన్12(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు శ్రీరాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని సమీప నివాస ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు చిదంబర్‌రెడ్డి, శేషారెడ్డి, బీఎస్ పద్మావతి, నాగేశ్వర్‌నాయక్, రామలింగారెడ్డి, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

చిట్వేలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నేతివారిపల్లెలో గంగమ్మ జాతర అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారు మేళతాళాలతో మండపానికి చేరుకున్నారు. భక్తులు అమ్మవారికి అడుగడుగున బలిదానాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

పుల్లంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్దినిదేవి సమేత శాంతిలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయంలో 2 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక కథనంపై అందంగా అలంకరించిన ప్రత్యేక రథంపై ఆశీనులు చేసి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.



మానవ మనుగడకు మొక్కలు పెంచాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె,జూన్12(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ప్రాణాధారమైన చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ తెలిపారు. పాఠశాల ప్రారంభం సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్ల నరికివేతతో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగి ఓజోన్ పొర దెబ్బతింటుందని తెలిపారు. బీడు భూముల్లో, బంజరు భూముల్లో, ప్రభుత్వ భూ ముల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచాలన్నా రు. మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. మొక్కల్ని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. ప్రతి పుట్టినరోజుకు ఒక మొక్కను నాటి దాన్ని పెంచి పోషించాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



వెంకట్రమణ నాయుడు (ఫైల్)

సుండుపల్లె, జూన్12(ఆంధ్రజ్యోతి): చిన్నగొల్లపల్లి మాజీ సర్పంచ్ గురిగింజకుంట వెంకట్రమణనాయుడు (75) మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. వెంకట్రమణనాయుడు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహానికి వారు నివాళులర్పించారు.

అందని ఉపాధి బిల్లులు

- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు
- రెండు నెలలుగా విడుదలకు నోచుకోని నిధులు
- బిల్లులు రాకపోవడంతో పనులకు వెళ్లని కూలీలు


రెడ్డివారిపల్లెలో ఉపాధి పని చేస్తున్న కూలీలు (ఫైల్)

గాలివీడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. ఒకప్పుడు వ్యవసాయమే జీవనాధారంగా ఉండే ఈ ప్రాంతంలో ప్రస్తుతం వ్యవసాయం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇక చేసేదేమీ లేక ప్రజలందరూ ప్రత్యామ్నాయ మార్గాలైన ఇతర పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అందులో ముఖ్యమైనది కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం. ఈ పథకం ద్వారా కొంత మేర ప్రజల జీవనం సాగుతున్నది. అయితే గత రెండు నెలలుగా చేసిన ఉపాధి పనులకు బిల్లులు పడకపోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక అప్పులు చేసి మరీ జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చేసిన పనులకు బిల్లులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కూలీలు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే...

జాతీయ ఉపాధి హామీ పథకం కరువు కాటకాలతో పేద ప్రజలను ఆదుకోవడానికి ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పిస్తున్నారు. ప్రతిరోజు పనిచేసినందుకు ఒక్కొక్కరికి రూ.300 కూలీని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఆర్థిక సంవత్సరం అనగా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఎప్పుడైనా వంద రోజులు కూలీలకు పని కల్పించాలి. అయితే ముఖ్యంగా వేసవి కాలంలో ఇతర ఎలాంటి పనులు ఉండవు కాబట్టి ఏప్రిల్, మే, జూన్ నెలలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ నెలలో ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభమైతే గత రెండు నెలల నుంచి కూలీలు చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు పడలేదు. మండలంలో 17 పంచాయతీలు కలవు. ప్రతి పంచాయతీలో వందల సంఖ్యలో కూలీలు పనులు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 15 వేలకు పైన జాబ్‌కార్డులు కలవు. ఏప్రిల్ నుంచి ప్రతిరోజు 6 వేల నుంచి 9 వేల వరకు కూలీలు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక లక్షకు పైన కూలీలు పనిదినాలు చేశారు. దాదాపుగా వీరందరికీ నాలుగు కోట్లకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. కానీ ఇంతవరకు డబ్బులు విడుదల కాలేదు. ఇదిలా ఉంటే రెండు నెలలుగా డబ్బులు పడకపోవడంతో కూలీలు అందరూ అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సి వస్తున్నది. గత రెండు నెలలుగా డబ్బులు పడకపోవడంతో కూలీలు కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు పోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి కూలీల డబ్బులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో కూలీల అకౌంట్‌లోకి డబ్బులు

- ఏపీవో హరిప్రసాద్

గత రెండు నెలలుగా కూలీలకు డబ్బులు పడని మాట నిజమే. కానీ తొందరలో చేసిన పనుల్లో అన్నింటికీ కూలిల అకౌం ట్‌లోకి డబ్బులు పడతాయి. కూలీలకు రావాల్సిన డబ్బులపైన ప్రభుత్వం తొందరలో విడుదల చేస్తున్నట్లు క్లారటీ కూడా ఇచ్చింది. కావున రెండు, మూడు రోజుల్లో కూలీలందరికీ డబ్బులు అందుతాయి.

రెండు నెలలుగా బిల్లులు పడలేదు

- రామిరెడ్డి, పూలుకుంట రెడ్డివారిపల్లె



ఈ సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చేసిన ఉపాధి పనులకు బిల్లులు పడలేదు. నేను ప్రతిరోజు ఉపాధి పనులకు వెళుతున్నాను. తనతో పాటు మా కుటుంబంలో ఇంకా ముగ్గురం వెళుతున్నాము. మా కుటుంబానికి రూ.35 వేలకు పైగా రావాల్సి ఉంది. కావున ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులకు సంబంధించి నిధులను విడుదల చేయాలి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పెద్దమండ్యం మండలాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడ్డారు. గురువారం మదనపల్లె మండలం రాయనచెరువు కురవపల్లెకు చెందిన గోవర్ధన్ ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతుండగా సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవర్ధన్ సహా ధనలక్ష్మి గాయపడింది. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం మండల కలిచెర్లకు చెందిన సాంబశివ (18), శ్రీకాంత్ (18), రెడ్డిశేఖర్ (35), శివకుమార్ (14), మదనపల్లెకు చెందిన దుర్గ (20) గుర్రంకొండ టమోటా మార్కెట్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు ఐదుగురు ప్రయాణికుల ఆటోలో కలిచెర్ల నుంచి గుర్రంకొండ టమోటా మార్కెట్‌కు వెళుతుండగా మార్గమధ్యలోని తురకపల్లె ఘాట్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురు గాయపడగా వీరిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా, పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన ఆరీఫుల్లా

పీలేరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పీలేరు-రాయచోటి జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరీఫుల్లా (40) అనే వ్యక్తి మృతి చెందాడు. కలకడకు చెందిన ఆరీఫుల్లా ద్విచక్రవాహనంపై వెళుతుండగా తిమ్మాపురం వద్ద కారు ఢీకొనడంతో అదే సమయంలో వెళుతున్న ఐషర్ వాహనం కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీపల్లె ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నేత హోటల్ ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు


దాడిలో ధ్వంసమైన హోటల్ సామగ్రి

పీలేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు, అతడి కుమారులు, వారి స్నేహితులు తన భర్తను హతమారుస్తామంటూ బెదిరిస్తున్నారని టీడీపీ నేత పులిచెర్ల మహేశ్ సతీమణి రజని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త కాలికి తగిలిన గాయానికి చికిత్స కోసం తాను, తన భర్త బుధవారం ఉదయం పీలేరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కారు పక్కకు పెడుతుండగానే సెక్యూరిటీ గార్డు ధరణి తన భర్తను దుర్భాషలాడడమే కాకుండా తన్నేందుకు కాలు ఎత్తాడని ఆరోపించారు. అదే సమయంలో తన భర్త కారు డోరు తీయడంతో అతను కిందపడిపోయాడన్నారు. అయితే చికిత్స అత్యవసరం కావడంతో తాను తన భర్తను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి ధరణి వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లానన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ధరణి, అతడి కుమారులు, వారి స్నేహితులు తనపై దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. అంతే కాకుండా బుధవారం రాత్రి వారు తమ ఇంటి వద్దకు కొడవళ్లు, ఇనుప రాడ్లతో వచ్చి తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. అంతటితో ఆగకుండా స్థానిక హెరిటేజ్ ఫ్యాక్టరీ ఎదుట జీవనోపాధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న చికెన్ సెంటర్, హోటల్‌ను పూర్తిగా ధ్వంసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను, తన భర్తను కాపాడాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్ ఆమెకు తెలియజేశారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్ఐ

కలకడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువకుడు తౌనిక్‌అలీ కిడ్నాప్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆర్థిక లావాదేవీలపై కలకడకు చెందిన తౌనిక్‌అలీని రాయచోటికి చెందిన అతడి బంధువు ఖాజా మంగళవారం కిడ్నాప్ చేసిన విషయం విదితమే. తౌనిక్‌అలీని మట్టుబెట్టాలని ఖాజా అతడి అనుచరులు సుహేల్, షబ్బీర్, అక్రమ్, మహ్మద్‌హుసేన్, ఫాజిల్ సహాయం తీసుకొన్నట్లు తెలిపారు. దీనికోసం బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాల్లో కలకడకు వచ్చి తౌనిక్‌అలీని రాయచోటికి తీసుకెళ్లి దారుణంగా కొట్టినట్లు తెలిపారు. దర్యాప్తు వేగవంతం చేసి మండలంలోని కోన క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండు నిమితం వాల్మీకిపురం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న ఈఈ రాజశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అరవపల్లెలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఆవరణంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సోలార్‌వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల వినియోగదారుడికి మేలు జరుగుతుందన్నారు. వీటి ఏర్పాట్ల వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. సబ్సిడీపై సోలార్ ఏర్పాటు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ బాలసుబ్రమణ్యం, తహసిల్దారు అమరేశ్వరి, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, మోడపోతుల రాము, ప్రజలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి


మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

రాజంపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. గురువారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేయడం, పిచికారీ మందులు సరఫరా చేయడం ఇలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా పెద్దఎత్తున పంటలను పండించడం బీజేపీ చొరవేనన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, బీజేపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు, కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, గ్రామ కమిటీల రాయలసీమ ఇన్‌చార్జి శరత్‌కుమార్, క్రిష్ణయాదవ్, మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మనోహర్ గౌడ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంబై-చెన్నై జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం


ప్రమాదంలో బొలెరోపై పడ్డ ఇనుప పైపులు, మృతి చెందిన రైతు రాజన్న, జాతీయ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

- ఇనుప పైపులతో వెళ్తున్న లారీని ఢీకొన్న బొలెరో వాహనం
- రైతు మృతి... ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- జాతీయ రహదారిలో 10 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్

ములకలచెరువు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలో గురువారం మధ్యాహ్నం ఇనుప పైపులతో వెళ్తున్న లారీని టమోటాలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో లారీలో ఉన్న ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడంతో ఓ రైతు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిలో ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల కథనం మేరకు... బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ పాత కురవపల్లెకు చెందిన రైతులు బగ్గల రాజన్న (55), రామచంద్ర (60) తాము పండించిన టమోటాలతో బొలెరో వాహనంలో ములకలచెరువు మార్కెట్‌కు వెళుతూ వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లె క్రాస్ వద్ద హైదరాబాదు నుంచి మధురైకు ఇనుప పైపులు తీసుకెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొనడంతో ఇనుప పైపులు బొలెరో వాహనంపై పడ్డాయి. దీంతో రైతు బగ్గల రాజన్న (55) వాహనంలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. మరో రైతు రామచంద్ర, డ్రైవర్ గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బొలెరోలో ఇరుక్కుపోయి మృతి చెందిన రైతు, మరో ఇద్దరిని ఎక్స్‌వేటర్ సహాయంతో అతికష్టం మీద బయకు తీయించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. లారీని ఢీకొన్న బొలెరో వాహనం రోడ్డుకు అడ్డంగా ఉండడంతో జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా 10 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. రోడ్డుకు అడ్డుగా ఉన్న బొలెరో, లారీని పోలీసులు ఎక్స్‌వేటర్‌తో పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. కాగా మృతుని కుటుంబీకులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

లారీని పక్కకు తీసేందుకు తప్పని ఇబ్బందులు

భారీ పరిమాణం గల ఇనుప పైపులు తీసుకెళ్తు రోడ్డు ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీని పక్కకు తీసేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బొలెరో ఢీకొన్న సమయంలో లారీ పక్కకు తప్పించబోయే క్రమంలో ముందు భాగం దెబ్బతిని రెండు చక్రాలు ఊడిపోయాయి. రెండు ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడం, మరో నాలుగు పైపులు లారీలోనే ఉండిపోయాయి. దీంతో జాతీయ రహదారికి అడ్డుగా ఉన్న లారీని పక్కకు తీసేందుకు వీలు కాలేదు. ఈ నేపథ్యంలో లారీలో ఉన్న మిగిలిన ఇనుప పైపులు ఎక్స్‌కవేటర్‌తో కిందకు దింపారు. లారీని రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో పక్కకు తీశారు.

వివాదాస్పద భూమిలో బోరు తవ్వకం

- అడ్డుకున్న బాధితులు..పోలీసుల ప్రవేశం


వివాదాస్పద భూమిలో బోరులారీని అడ్డుకున్న బాధితులు, సర్దిచెబుతున్న పోలీసులు

మదనపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రెండు వర్గాల మధ్య కొన్నేళ్లుగా వివాదంలో ఉన్న భూమిలో బోరు తవ్వకానికి వెళ్లిన వారిని బాధితులు అడ్డుకున్నారు. భూమి తమదిగా చెబుతున్న ఆ వర్గం పోలీసులతో పాటు భూమిలోకి వెళ్లారు. ఈ క్రమంలో బాధితులను అడ్డుకుని, బోరుబండిని వివాదాస్పద భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. చివరకు బాధితులు ప్రతిఘటించడంతో పోలీసులు సహా వారంతా వెనక్కి వెళ్లాల్సివచ్చింది. బి.కొత్తకోట మండలం బోదలవారిపల్లె వాసులు గుడే వెంకటశివకు, మరొకరి మధ్య ఐదేళ్లుగా భూవివాదం నడుస్తోంది. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె రెవెన్యూ గ్రామం సర్వేనంబరు 697-2లో 4.90 ఎకరాల భూమి వుంది. ఈ భూమిని మదనపల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులకు ప్రభుత్వం డీకేటీ పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. అనంతరం ఈ భూమిని బోదలవారిపల్లెకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటికే ఉత్తన్న కుమారుడు జి.వెంకటశివ 40ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఎండార్స్‌మెంట్‌లో పేర్కొన్నారు. అయితే తమకు పట్టా ఇచ్చినట్లు చెబుతున్న మదనపల్లెకు చెందిన ముగ్గురు మరొకరికి భూమిని విక్రయిస్తే ఎలా చెల్లుతుందని బాధితులు వాపోతున్నారు. ఇదిలావుండగా, వివాదాస్పద భూమిలో బోరు వేయడానికి ఓ వర్గం, బోరు బండితో గురువారం భూమిలోకి వెళ్లగా బాధితులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఈక్రమంలో వెంకటశివ వర్గాన్ని పోలీసులు బలవంతంగా పోలీసు జీపులోకి ఎక్కించడానికి ప్రయత్నించగా, అడ్డుకున్నారు. వివాదంలో ఉన్న భూమిలోకి పోలీసులు ప్రవేశించడం ఏంటని ప్రశ్నించడంతో చివరకు అక్కడి నుంచి వారంతా వెళ్లిపోయారు. ఇదిలావుండగా, అసైన్‌మెంట్ పట్టా అన్యాక్రాంతం అయిందనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు పీఓటీలో పెట్టినట్లు చెబుతున్నారు. పట్టణానికి చెందిన వ్యక్తులు బోదలవారిపల్లెకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి విక్రయించడంతో పోలీసుల సహకారంతో తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వివాదం నేపథ్యంలో అక్కడికి రెవెన్యూ అధికారులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వెనుదిరిగి వచ్చేశారు.

బ్లాస్టింగ్ చేసే గంట ముందు హెచ్చరికలు చేయాలి

- డీడీఎంఎస్ అధికారి కిశోర్‌కుమార్


రైతులు, అధికారులతో మాట్లాడుతున్న డీడీఎంఎస్ అధికారి

ఓబులవారిపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీలో బ్లాస్టింగ్ చేసే సమయంలో ఒక గంట ముందు హెచ్చరికలు జారీ చేయాలని దీంతో సమీప ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటారని నెల్లూరు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) అధికారి కిశోర్‌కుమార్ తెలిపారు. ఏపీఎండీసీ మైన్స్ మంగంపేట పరిధిలో ఉన్న పంట పొలాల్లో పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని అందిన ఫిర్యాదు మేరకు నెల్లూరు డీడీఎంఎస్ అధికారి కిశోర్‌కుమార్ గురువారం ఇక్కడిక వచ్చి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మైనింగ్ వల్ల తమ పంటలకు, పశువులకు ప్రమాదం ఉందని, తమ పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని తెలుపగా బ్లాస్టింగ్ చేసే సమయానికి సుమారు గంట నుంచి ఆ పరిసర ప్రాంతాల్లో హెచ్చరికలు చేస్తూ వెళ్లాలని దీనివల్ల ఇటు సంస్థకు అటు ప్రజలకు నష్టం జరగకుండా ఉంటుందని ఆయన ఏపీఎండీసీ అధికారులకు తెలిపారు. రైతుల రాకపోకలకు, వారి భద్రతకు ఆస్తి, ప్రాణ, పంట నష్టాలు జరగకుండా మైనింగ్ నిర్వహించాల్సిన బాధ్యత ఏపీఎండీసీపై ఉందని ఏపీఎండీసీ అధికారులు సుదర్శన్‌రెడ్డి, గోపినాథ్‌లకు తెలిపారు. అలాగే పలు అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మంగంపేట గ్రామస్థులు, గునిపాటి చెన్నరాయుడు, గునిపాటి వేణుగోపాల్, కొటారు సుబ్రమణ్యం, పోతుల లక్ష్మీనారాయణ, కౌలూరి సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోండి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలియచేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

రాజంపేట టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, సంస్థ ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గాలి చంద్ర, జిల్లా కార్యదర్శి సికిందర్, ఆటోవర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం రాజంపేట ఆర్‌అండ్‌బీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీలు ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగిస్తోందని ఆరోపించారు. 1200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో తొలగించారన్నారు. ఇప్పుడు మరో 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి జాబితాను సిద్ధం చేశారన్నారు. తమ ఉద్యోగాలను రక్షించుకోవడం 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేయాల్సిన స్థితి యాజమాన్యం కల్పించదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహ, మహమ్మద్, సుబ్రమణ్యం, నన్నేసాహెబ్, వెంకటప్ప, వెంకటస్వామి, ఎస్.రమణ, గోవిందు, ఆటో యూనియన్ నాయకులు సాయి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

దొంగ ఫొటో విడుదల


బ్రాందీ షాపులో చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

సిద్దవటం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శ్రీకృష్ణ వైన్‌షాపులో జరిగిన చోరీ సంఘటనలో దొంగ ఫొటో విడుదల చేస్తున్నామని, ఎవరైనా ఈ ఫొటో గుర్తు పడితే 9121100581, 9121100584 నంబర్లకు సమాచారం తెలపాలని ఎస్ఐ మహమ్మద్ రఫి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు...శ్రీకృష్ణ వైన్‌షాపులో జూన్ 2న మద్యం, నగదు చోరీకి గురైంది. చోరీ చేసిన వ్యక్తి ముఖానికి మద్యం, అట్టముక్కలు అడ్డం పెట్టుకుని చాకచక్యంగా చోరీ చేశాడు. సిద్దవటం, భాకరాపేట, పోలీసులైన్ క్రాస్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించామని ఎస్ఐ వివరించారు.

మూన్నాళ్ల ముచ్చటగా... పెళ్లి బంధం

● చిన్నచిన్న కారణాలతో విడిపోతున్న దంపతులు
● పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్న జంటలు ● జంటలను కలిపేందుకు పోలీసుల యత్నం



మాంగల్యం తంతునాం.. మమ జీవన హేతునాం. అంటూ వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మూడు ముళ్లు వేసి.. అగ్ని సాక్షిగా పెళ్లిళ్లు చేసుకుంటున్నా.. అది మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది.. ప్రస్తుతం యువత పెళ్లి జరిగిన నెలల వ్యవధిలో కొందరు.. మరికొందరు పెళ్లి తంతు జ్ఞాపకాలను నెమరు వేసుకునే లోపే బంధాలను తెంచేసుకుంటున్నారు. అయితే వీరు విడిపోవడానికి అంత బలమైన కారణాలు కూడా ఉండటం లేదు. చిన్న చిన్న మనస్పర్థలతో పంతా లకు పోయి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. వీరికి సర్ది చెప్పాల్సిన కొంత మంది తల్లిదండ్రులు తమ బిడ్డలను వెనకేసుకు వస్తుండడంతో కాపురాలు కూలిపోతున్నాయి.

కడప (క్రైం), జూన్ 12: పెళ్లి అంటే తెంచు కుంటే తెగిపోయే బంధం కాదు.. జన్మజన్మల బంధం అని పెద్దలు చెబుతారు. అయితే ప్రస్తుత హైటెక్ యుగంలో పెళ్లి బంధం మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. కాళ్ల పారాణి ఆరకముందు కటీఫ్ చెబుతున్నారు. చిన్న చిన్న కారణాలకే వెనక ముందు ఆలోచించకుండా దంపతులు విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో నిండు నూరేళ్ల అన్యోన్యంగా కలిసి జీవించాల్సిన జంటలు ఎవరి దారి వారిది అన్నట్లు విడిపోతున్నారు. ఇలా ఇటీవల కాలంలో వందల జంటలు ఈ బాట పడుతున్నాయి.

టెక్నాలజీ ఎంత వేగంగా పెరుగు తోందో అంతే వేగంగా నిర్ణయాలు తీసుకుంటు న్నారు. భార్య భర్తల మధ్య అహం.. అపార్థం, అనుమానాలు.. ఒకరిపై ఒకరికి ఆపనమ్మకా లతో విభేదాలు వస్తున్నాయి. నాలుగు గోడల మధ్య సర్దుకుపోవాల్సిన బంధాలు చాలా వరకు రోడ్డున పడుతున్నాయి. చిన్న సమస్యలకు కూడా భార్యభర్తల మధ్య అగాధం పెరిగి చివ రికి విడిపోయేందుకు సిద్ధమై పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు...ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి పరిస్థితి కూడా మూన్నాళ్ల ముచ్చటగా తయారవుతోంది. క్షణికావేశంలో పంతాలకు పోయి బంధాలను తెంచుకుంటున్న దంపతుల ప్రభావం వారి పిల్లలపై కూడా చూపుతోంది.

ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో..

ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు క రువు అవుతున్నాయి. ఉద్యోగాలు, చదువులు, వ్యాపార రిత్యా పెళ్లైన కొత్త జంటలు ఒంటరిగా ఉండాలని కోరుకుంటున్నారు. తల్లిదండ్రులకు, అత్త మామలకు దూరంగా కొత్త కాపురాలు పెడుతున్నారు. దీంతో మంచి చెడు చెప్పే వారు లేక పెళ్లైన కొన్ని రోజులకే భార్యభర్తల మధ్య విబేధాలు వస్తున్నాయి. సర్దుకుపోయి కాపురాలు చేసుకోవాలని చెప్పేవారు లేక పోలీసు స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.



దంపతులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ యల్లమరాజు

కలిపేందుకే ప్రాధాన్యత...



చిన్న చిన్న మనస్పర్థలతో విడిపోయేందుకు పోలీస్ స్టేషన్‌కి వచ్చే దంపతులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. జంటలను కలిపేందుకే సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తున్నాం. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారు కూడా పోలీస్ స్టేషన్ గడప ఎక్కుతున్నారు. భార్యభర్తలు సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని నచ్చ చెప్పి పంపుతున్నాం.

-బాల స్వామిరెడ్డి, డీఎస్పీ, కడప మహిళ పోలీస్ స్టేషన్

ప్రేమ పెళ్లిళ్ల పరిస్థితి అంతే...

ఏళ్ల తరబడి ప్రేమించుకోవడం, తరువాత పెద్దలు ఒప్పుకోలేదంటు కొందరు పారిపోయి పెళ్లి చేసుకుంటున్నారు. పెళ్లి అనంతరం వారిజీవనానికి తగినంత సంపాదన లేకపోవడం, రాజీపడి జీవించలేకపోవడంతో దంపతుల మధ్య విబేధాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి దారు చిన్నచిన్న ఘటనలను కూడా పోలీసు స్టేషన్ల మెట్లు ఎక్కి, విడిపోయేందుకుసిద్ధమవుతున్నారు. ఇలాంటి వారు ఇటీవల ఎక్కువగా కనబడుతున్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన విద్యార్థులు

కడపస్పోర్ట్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీ ల్లో కడప జిల్లా ద్వితీ య ఛాంపియన్ షిప్ సాధించిందని తైక్వాండో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఇందులో సబ్ జూనియర్, కేడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో జిల్లా నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో 12 మంది బంగారు, 14 మంది రజత, 12 మంది కాంస్య పతకాలు సాధించారన్నారు.

ఇందులో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉత్తరాఖండ రాష్ట్ర హరిద్వార్‌లో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కాగా పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ట్రెజరర్ సలీం క్రీడాకారులను అభినందించారు.

దేనేపల్లిలో ఘటనలపై డీఎస్పీ ఆరా



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ముద్దనూరు జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి దేనేపల్లి గ్రామంలో జరిగిన వ్యక్తిపై గొడ్డలితో దాడి, మహిళపై లైంగిక వేధింపుల కేసులకు సంబంధించి గురువారం డీఎస్పీ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం దేనేపల్లి గ్రామంలో బోల రామ్మోహనపై గొడ్డలితో జరిగిన దాడి, అదే గ్రామంలో ఓ మహిళపై జరిగిన లైంగిక వేధింపులకు సంబం ధించి పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదైన విషయం విధితమే. వాటికి సంబంధించి డీఎస్పీ పొలం వద్దకు వెళ్లి ఘట నలకు గల కారణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ షైనుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగిన వ్యక్తి మృతి

కాశినాయన జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు.. మండలంలోని కొండ్రాజుపల్లెకు చెందిన కుమారి రమణయ్య (52)కు వ్యవసాయంలో వరుస నష్టాలు రావడం, మరో వైపు అనారోగ్యం వేధిస్తుండడంతో అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 10వ తేదీ మంగళవారం విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



జమ్మలమడుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో చాకలి అంకాళయ్య (35) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. మృతుడు మోరగుడి గ్రామంలో అద్దకపు బట్టీల వద్ద చీరెలకు, నూలు వస్త్రాలకు రంగులు వేసే కూలి పనులకు వెళ్లేవాడన్నారు. గురువారం మద్యం అతిగా తాగి అనారోగ్యాని కి గురవడంతో బంధువులు 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

24 గొర్రెలు అపహరణ

దువ్వూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లెలో 24 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఈమేరకు బాధితుడు సుబ్బరాజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలంలోని కలం దొడ్డిలో ఉంచిన గొర్రెలను రాత్రివేళ వాహనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు నమోదు అయ్యాయని.. పోలీసులు నిందితులను పట్టుకుని న్యాయం చేయాలని గొర్రెల యజమాని కోరారు.

చెట్టుపడి హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

ఖాజీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామం వద్ద గురువా రం చెట్టు విరిగిపడటంతో హెడ్ కానిస్టేబుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు... బద్వేలు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య వృత్తి నిమిత్తం ఖాజీపేట నుంచి వెళుతుండగా ఆంజనేయకొట్టాలు సమీపంలోకి రాగానే చెట్టు విరిగిపడింది. దీంతో కొమ్మలు ఆయనపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స కోసం కడపకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

వైసీపీ వలస పక్షులు దోచుకున్నది రికవరీ చేస్తాం

● పెద్దిరెడ్డి ఫ్యామిలీకి బ్యాడ్ టైం మొదలైంది ● టీడీపీ విజయోత్సవ ర్యాలీలో జయచంద్రారెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఐదేళ్లలో పుంగనూరు నుంచి వచ్చిన వైసీపీ వలస పక్షులు బ్రిటీషు వారి కంటే ఘోరంగా దోచుకున్నారని..వారికి బ్యాడ్ టైం మొదలైందని, వారు దోచుకున్నదంతా రికవరీ చేస్తామని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం తంబళ్లపల్లెలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల వద్ద నుంచి హరిత కూడలి వరకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో ర్యాలీ చేశారు. ఎన్టీఆర్ ఘాట్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భారీ కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ర్యాలీకి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలిరావడంతో తంబళ్లపల్లె పసుపుమయమైంది. అనంతరం ఏర్పాటు చేసిన రోడ్‌షోలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించారన్నారు. పుంగనూరు నుంచి వలస వచ్చిన పెద్దిరెడ్డి కుటుంబం ఐదేళ్లలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని బ్రిటీషు వారి కంటే ఘోరంగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. భూములు, ఇసుక సహా..ఇక్కడి నుంచి దోచుకెళ్లిన ఏ ఒక్కటీ వదిలిపెట్టమని అన్ని రికవరీ చేస్తామన్నారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో రూ.300 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. హంద్రి-నీవా కాలువలను చెరువులకు అనుసంధానం చేసి ప్రతి చెరువుకు, ప్రతి ఎకరాకు నీరందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, మండలాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, క్లస్టర్ ఇంచార్జి బేరి శీన, తెలుగు యువత సోము శేఖర్, పురుషోత్తం, వీరాంజనేయులు, మదన, కాలా నారాయణ, నరసింహులు, మణి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మాహుతికి యత్నించిన వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు భరించలేక ఆత్మాహుతికి యత్నించిన కడప జిల్లాకు చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు..

కడప జిల్లా చిలమకూరు గ్రామానికి చెందిన నగనూరు వెంకటసుబ్బయ్య (44) తిరుపతి అత్తులూరి ట్రస్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆర్థిక, ఇంట్లో సమస్యలతో జీవితంపై విరక్తి చెంది గ్రీన్‌పార్కు అపార్టుమెంటు సమీ పంలోని ఖాళీ స్థలంలో మంగళవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అత్తులూరి ట్రస్టులో పనిచేస్తున్న అతని సమీప బంధువు మేనేజర్ వెంకటేశ్వర్లు విషయం తెలుసుకుని అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేద్దాం

కడప క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి అన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి తమ వంతు కృషి చేస్తామని యోగా సాధకులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిన బూనారు. గురువారం ఉదయం శిల్పారామంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచనల మేరకు వన్ఎర్త్- వన్ హెల్త్ కార్యక్రమ వేదికపై ఈగల్ (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంటు) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఏపీ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ ఎస్.మురళీబాబు, జిల్లా పర్యాటక అధికారి సురేశ్‌కుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు : చైర్మన్



నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ఐఎంపీఎస్ సేవలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

కడప రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌తో పాటు ఐఎంపీఎస్ సేవలను గురువారం నుంచి అం దుబాటులోకి తెచ్చినట్లు డీసీసీబీ చైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం డీసీసీబీ కార్యాలయంలో బోర్డు మీటింగ్‌ను నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు ఖాతాదారుడు ఒక లక్ష వరకు చెల్లింపును మిగతా బ్యాంకులకు గానీ, డీసీసీబీకి గానీ నిమిషం లోపు చెల్లించే వీలు కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈవో వెంకటసుబ్బయ్య, ఆప్కాబ్ డైరక్టర్ రాంబాబునాయక్, నాబార్డ్ డీడీఎం విజయ్‌విహారి, ఈసీవో రాజామణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తోరణాలు, జెండాలు పీకి కాల్చివేత

● మరోమారు పోలీస్‌స్టేషన్‌కు చేరిన వ్యవహారం



టీడీపీ తోరణాలను రోడ్డు పక్కన పడేసి నిప్పుపెట్టిన దృశ్యం



పులివెందులలోని రింగురోడ్డు కూడలిలో టీడీపీ జండాలను తొలగిస్తున్న యువకుడు

పులివెందుల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రింగురోడ్డులో సర్కిళ్లలో ఉన్న టీడీపీ తోరణాలను, జెండాలను కొందరు యువకులు పీకేసి రోడ్డు పక్కనపడేసినిప్పుపెట్టారు. ఈ వ్యవహారం కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...గురువారం సాయంత్రం కొంతమంది యువకులు రింగురోడ్డులో టీడీపీ మహానాడు కార్యక్రమం జరిగే సమయంలో తోరణాలు, జెండాలను ఏర్పాటు చేశారు. వీటిని ఇద్దరు ముగ్గురు యువకులు పీకి రోడ్డు పక్కన పడేసి నిప్పుపెట్టి తగులబెట్టారు. దీన్ని మొబైల్‌లో వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయం టీడీపీ నాయకులకు తెలిసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇటీవల కడపలో జరిగిన టీడీపీ మహానాడు కార్యక్రమం సందర్భంగా పులివెందులలోని రింగ్ రోడ్ల కూడళ్లలో ఏర్పాటు చేసిన తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీల పీకేసిన ఘటనలో 13 మంది పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ వ్యవహారం జరిగి సమస్య ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్న సమయంలో కొందరు యువకులు గురువారం తోరణాలు తొలగించి రోడ్డుసైడు పడేసి నిప్పుపెట్టడంతో మళ్లీ సమస్య జఠిలమైంది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

రాక్షస పాలన నుంచి విముక్తికి ఏడాది

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన ● ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు ● వాడవాడలా విజయోత్సవాలు ● కేక్‌లు కట్ చేసిన నాయకులు

రాష్ట్రంలో రాక్షస రాజ్యానికి ప్రజలు చరమ గీతం పాడి ఏడాది పూర్తయింది. ప్రజలు ఐదేళ్ల అనేక రకాల ఇబ్బందులు పడి రాక్షస పాలననుంచి వి ముక్తి కోసం నినదించారు. దీంతో కూటమి ప్రభుత్వం విజయఢంకా మోగించి ఏడాది పూర్తయింది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అభిమానులు వాడవాడలా వార్షికోత్సవాలు వేడుకగా చేసుకున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులరించారు. మరి కొందరు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు టీడీపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. వివరాల్లోకెళితే....


పీలేరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు - ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జునైద్ అక్బారి, టీడీపీ నేతలు - పీటీఎంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

పీలేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువై ఏడాది పూర్తయిన సందర్భంగా పీలేరు, కేవీపల్లె మండలాల్లోని టీడీపీ శ్రేణులు గురువారం ఘనంగా సంబరాలు చేసుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సీనియర్ నేతలు కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చీకట్లో మగ్గిపోయిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నిలపాలన్న ఆశతో రాష్ట్ర ప్రజలు కూటమికి పట్టం కట్టారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువనేత నారా లోకేశ్ రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఏడాది పాలన సాగిందని, వచ్చే నాలు గేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతారన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్ర మాల్లో కేవీపల్లె మండల అధ్యక్షురాలు గీతాంజలి, నేతలు మల్లెల రెడ్డిబాషా, పోలిశెట్టి సురేంద్ర, రామకృష్ణారెడ్డి, ఎంజీవీ రమణ, శివారెడ్డి, వసంతాల రాజా, శేఖర, ప్రతాప్, షమ, లక్ష్మీకాంతమ్మ, వెంకటరత్నం, శివశంకర్ రెడ్డి, రమణ, రంజిత్, శీన, ధనంజయ, కుప్పం రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో....

వాల్మీకిపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి అన్నారు. నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. బైపాస్ రోడ్డులో గోకులం, చింతపర్తిలో సీసీ రోడ్డు ప్రారంభం నూతన శంకుస్థాపనలు చేశారు. మార్కెట్ చైర్మెన్ కోసూరి చంద్రమౌళి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రరెడ్డి నేతలు కృష్ణారెడ్డి, పీవీనారాయణ, రాజేంద్రాచారి, సురేంద్రవర్మ, కోసూరి రమేష్, దేపాని ప్రభాకర్, మురళి, రామచంద్ర, బొక్కసం బ్రదర్స్, కువైట్ బాబు, సయ్యద్ బాషా, తుంబూరి రమణ ,రాజగోపాల్, డిష్ బ్రదర్స్ గోవింద్, ఆలి, యూసుఫ్, కలందర్, జనసేన రెడ్డి, సయ్యద్ అమీర్, ఆదినారాయణ, గంగులప్ప నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో....

గుర్రంకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడాది పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకోవడంతో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బస్టాండు, పార్టీ కార్యాల యంలో కేక్ కట్ చేశారు. నేతలు జగదీష్, నౌ షాద్ అలీ, ఎల్లుట్ల మురళీ, నౌషాద్అహ్మద్, చంద్రబాబు, చలమారెడ్డి, మహాత్మారెడ్డి, దేవికారెడ్డి, సుంకరశేఖర్, బయ్యారెడ్డి, క్రాంతి, ప్రకాశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో....

కలకడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో కలకడలో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నేతలు అబ్బూరి తిరుపతి నాయుడు, కాంతారావు, విశ్వనాథ్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

కలికిరిలో....

కలికిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా అమరనాథ రెడ్డి భవన్‌లో టీడీపీ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస వర్మ, నేతలు జ్ఞానమూర్తి, వైజాగ్ బాషా, రత్నశేఖర్ రెడ్డి, తిప్పా రెడ్డి, ఏసురాజు, రోజారాణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

మదనపల్లె టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగి ఏడాది అయిన సందర్భంగా మదనపల్లె నేతలు సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే షాజహాన్ బాషా కుమారుడు జునైద్ అక్బారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎం. నాగయ్య, ఎర్రబెల్లి వెంకటరమణరెడ్డి, బాబాఫకృద్దీన్, ముద్దు కృష్ణమనాయుడు, ఖాజా పీర్, రాటకొండ భార తి, బైగారి భారతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె సర్కిల్ వద్ద...

నిమ్మనపల్లె సర్కిల్ వద్ద లోకేశ్ యువసేన అధ్యక్షుడు కంచెర్ల చింటు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన రాయల సీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రసంగించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులు నాయుడు, నేతలు జంగాల శివరాం, బండి ఆనంద్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో....

నిమ్మనపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జగనాసురున్ని మెడలు విరిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం, మండల అధ్యకుడు వెంకటరమణ పేర్కొన్నారు. బస్టాండులో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాన్ చిత్రపటాలను ఏర్పాటు చేసి బాణసంచ పేల్చుతూ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజయ్, హరి, సూర్యప్రకాష్, శంకర, సిద్దరామయ్య, షఫి, మల్లికార్జున, ప్రదీప్, రామకృష్ణ, రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టి.సదుంలో....

పెద్దతిప్పసముద్రం జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ శారద ముని, మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనాథ్‌రెడ్డి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బొంగు ఈశ్వర్‌రెడ్డి, పకృద్దీన్, ఏఆర్. ఈశ్వర్‌రెడ్డి, అనంతాపురం సుబ్బిరెడ్డి, రామాపురం గంగిరెడ్డి, కె.వి. రమణ, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో....

పెద్దమండ్యం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవ ర్యాలీ పెద్దమండ్యంలో గురువారం రాత్రి జరిగింది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు టీడీపీ యువనేత మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి తో కూటమి నాయకులు ర్యాలీ సాగింది. ర్యాలీలో హరి, గంగాధర, ఆంజనేయులు, మహేశ్వర, రఘునాథరెడ్డి, గల్లా నారాయణ, చంద్రారెడ్డి, రెడ్డిహుసేన్, అష్రఫ్. పవన్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నిమ్మనపల్లి/పెద్దమండ్యం/పెద్దతిప్పసముద్రం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం అని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం రాచవేటివారి పల్లి పంచాయతీ ఆర్బీకేలో రైతులకు వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మారెప్ప, టీడీపీ నేతలు శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దమండ్యం మండలంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, మండ ల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ వేరుశనగకాయలు బస్తాలను పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో అధికారులు, నేతలు సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేశారు. పెద్దమండ్యం వ్యవసాయాధికారి సురేష్‌బాబు, నేతలు గంగాధర, మహేశ్వర, బాబ్‌జాన్, అష్రఫ్, చంద్రారెడ్డి, గల్లానా రాయణ, బాబ్‌జాన్, నాగేశ్వర రెడ్డి, చలపతి, రామాంజులు నాయుడు, రామాంజులు ఎంపీఈఓలు పాల్గొన్నారు.

● ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనే కాయలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దతిప్పసముద్రం మండల వ్యవసాయాధికారి ప్రేమలత రైతులకు సూచించారు. పీటీఎం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో స్థానిక నేతలతో కలిసి వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, నేతలు నెలవంక హరి, కుందిలి వెంకటరెడ్డి, పి. మునిరెడ్డి, డి. యర్రంరెడ్డి, జి. నారాయణ స్వామి, గొందిపల్లె బాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్బిరెడ్డి, ఎస్ హజమత్, నాగరాజు, జి కృష్ణారెడ్డి, తో పాటు సచివాలయ సిబ్బంది అమరనాథ్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ


వృద్ధులకు ఇంటి వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రేషన్ దుకాణ డీలరు

మదనపల్లె అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పథకాల్లో భాగంగా రేషన్ షాపుల్లోనే వినియోగదారులకు నిత్యాసవర సరుకులు పంపిణీ చేస్తున్నారు. గురువారం పట్టణంలోని 41 రేషన్ షాపు డీలర్ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు కమ్మగడ్డవీధిలో వృద్ధురాలికి ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేశారు. డీలర్ రమేష్ మాట్లాడుతూ కార్మికులు, మధ్యతరగతి కూలీలు, మహిళలు, ప్రజలు రేషన్ షాపుల్లో నిత్యావరాలు పంపిణీ చేయడంతో ఉదయం, సాయంత్రం తమకు అనుకూల సమయంలో రేషన్ షాపుల వద్దకు వచ్చి సరుకులు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీలర్స్ సుమిత్ర, రమేష్, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా పనిచేద్దాం


వడ్డిపల్లెలో ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్‌ఖాన్

మదనపల్లె టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా ప్రజలంతా కలిసి పనిచేద్దామని లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో వడ్డిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడుల్లో వుండాల్సిన బాలలను బలవంతంగా పనుల్లో వుంచడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, జలజ, సుభాషిణి, అల్తాఫ్, స్వర్ణ, జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పుష్పలత, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి


వీఆర్వోల సమీక్షలో తహసీల్దారు శివకుమార్

పీలేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని పీలేరు తహసీల్దారు శివకుమార్, వీఆర్వోలను ఆదేశించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన వీఆర్వోలతో సమీక్షిస్తూ పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి కొత్త పథకాలు వస్తున్నందున పెండింగ్ శాతాన్ని తగ్గించుకోవాలన్నారు. అనంతరం ఆయన గ్రామాల వారీగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుండ్లపల్లె టీడీపీ గ్రామాధ్యక్షుడిగా రెడ్డప్పనాయుడు

తంబళ్లపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లె టీడీపీ గ్రామాధ్యక్షుడిగా ఇర్రి రెడ్డప్పనాయుడు ఎన్నికయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సూచనల పై తంబళ్లపల్లెలో టీడీపీ మండల సీనియర్ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో గుండ్లపల్లె టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు.

బాలల వికాసానికి మొదటి అడుగు

అంగన్వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం ● మూడేళ్ల నుంచి సృజనాత్మక విద్య


తంబళ్లపల్లె కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ సుజాత - అంగన్ వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం వాల్మీకిపురంలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న అధికారులు, నేతలు

పెద్దతిప్పసముద్రం జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాలల వికాసానికి మొదటి అడుగు అంగన్వాడీలని, చిన్నారులకు మూడేళ్ల నుంచే సృజనాత్మక విద్య నేర్పుతారని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పీటీఎం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మూడేళ్లు నిండిన పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయాలన్నారు. గురువారం సీడీపీఓ అంగన్‌వాడీ సూపర్ వైజర్ తో కలిసి మద్దయ్యగారిపల్లె కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం ప్రారంభించారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ హెల్పర్లు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట ....

బి.కొత్తకోట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చిన్నారులను సమీప అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని బి.కొత్తకోట ప్రాజెక్ట్ సీడీపీఓ భాగ్యమ్మ కోరారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాన్ని సీడీపీఓ పర్యవేక్షించారు. సెప్టెంబరు నాటికి మూడేళ్లు నిండే పిల్లలను సైతం అంగన్వాడీల్లో చేర్పించేలా ప్రీస్కూల్ ప్రాముఖ్యతను, ప్రభుత్వ పథకాలపై తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. నగరపంచాయతీ పరిధి సెవెన్ సెంటర్‌లో చిన్నారులకు ఆమె స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ....

తంబళ్లపల్లె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి, శారీరక ఎదుగులకు అంగన్ వాడీల్లో చేర్పించాలని సీడీపీఓ సుజాత అన్నారు. గురువారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య అందిస్తారన్నారు. రోజూ పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లల వయసుకు తగిన ఎత్తు, బరువుతో ఉండేలా చూస్తారన్నారు. సూప్‌వైజర్లు చంద్రకాంత, రమణమ్మ, నాగలక్ష్మీ, అంగన్వాడీలు ఉమాదేవి, సరస్వతీ, కళావతి ఉన్నారు.

పీలేరు ....

పీలేరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యర్రంరెడ్డిగుట్టలోని అంగన్ వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిచారు. సూపర్ వైజర్ స్వరూప మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల్లో నిర్వహించే అక్షరాభ్యాస కార్యక్రమాలు పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసానికి గట్టి పునాది అవుతుందన్నారు అంగన్ వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రీ-ప్రైమరీ విద్య ప్రైవేట్‌కు దీటుగా ఉందని చెప్పారు. అంగన్ వాడీ కార్యకర్తలు చిన్నమ్మ, కళావతి, లక్ష్మీదేవి, శాంత, గౌస్నిసా, స్వర్ణ, తదితరులుసాహితి, అఖిల, లీలా పాల్గొన్నారు.

నిమ్మనపల్లి ....

నిమ్మనపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని 44అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ కుసుమరాణి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కావడంతో కొత్తగా అంగన్వాడీలో చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, పీఆర్‌పీలు పాల్గొన్నారు.

కలికిరి ....

కలికిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లు పూర్తవగానే బాలలకు ప్రత్యేక విద్యాబోధన అవసరమని ఐసీడీఎస్ అధికారులు చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం కలికిరిలోని రెండు సచివాలయాల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు మాట్లాడుతూ మూడేళ్ళు పూర్తయిన పిల్లలలో ఆరు రకాల వికాసాలు కలగాలని చెప్పారు. ఆటపాటల ద్వారా విద్యను అందజేస్తూనే వారికి శారీరక, మానసిక, సామాజిక భావోద్వేగాలతో సృజనాత్మక అభివృద్ధిని సాధించాలని తెలిపారు. సూపర్‌వైజర్ అరుంధతి, కలికిరి 1,2 సచివాలయాల అంగన్‌వాడీ టీచర్లు, మూడేళ్ళు పూర్తయిన పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం ....

వాల్మీకిపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వాల్మీకిపురం సీడీపీఓ భారతి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీ పిల్లల సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈఓ రవీంద్రనాథ్, సూపర్ వైజర్ రోహిణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రరెడ్డి, నేతలు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, రామచంద్ర, మురళి, విష్ణుచైతన్య, తదితర నేతలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

మదనపల్లె టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్త్రీ, శిశు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో బాధ్యతగా విధులు నిర్వహించాలని సీడీపీఓ నాగవేణి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బదిలీపై మదనపల్లెకు వచ్చిన సీడీపీఓ బాధ్యతలు చేపట్టారు. తంబళ్లపల్లె నుంచి నలుగురు, పుంగనూరు నుంచి ఒక సూపర్‌వైజర్ బదిలీపై మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బాధ్యతలు చేపటారు. అంగన్‌వాడీ సెంటర్లను విజిట్ చేస్తూ, ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచనలిచ్చారు. సూపర్‌వైజర్లు రమాదేవి, శ్వేత, కళావతి, ధనలక్ష్మి, కుసుమరాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మదనపల్లె టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డికి సూచించారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ స్థానిక సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీటీలు ఫిరోజ్‌ఖాన్, ఆర్ఎం బాబ్జి, ఆర్ఐ భరత్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట తహసీల్దార్‌గా బావాజాన్

బి.కొత్తకోట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట తహసీల్దార్‌గా ఏ.బావాజాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. డీటీ మహమ్మద్అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు సిబ్బంది ఆయన పుష్పగుచ్చాలు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. గుర్రంకొండ డీటీగా పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ అజారుద్దీన్ రామసముద్రానికి బదిలీ అయ్యారు.

గుర్రంకొండ తహసీల్దార్‌గా లక్ష్మీప్రసన్న

గుర్రంకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ తహసీల్దార్‌గా లక్ష్మీప్రసన్న బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు బదిలీపై తంబళ్లపల్లెకు వెళ్లారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లో డీటీగా పని చేస్తున్న లక్ష్మీప్రసన్న పదోన్నతిపై గుర్రంకొండ తహసీల్దార్‌గా నియమించారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యావసతులకు అధిక ప్రాధాన్యం


పాఠశాల్లో మొక్కలు నాటుతున్న నేతలు

కలకడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావసతులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని టీడీపీ అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన నేతలతో కలిసి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ మలాంషావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోష నివృత్తి కోసం పుష్పయాగం

కలికిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులపాటు వైభవంగా జరిగిన స్థానిక లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో తెలియకుండా జరిగిన దోషా నివారణకు గురువారం రాత్రి ఆలయంలో ఘనంగా దోష నివృత్తి పేరిట పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. దీని అనుబంధంగా నిర్వహించిన సాయనోత్సవం భక్తులను అలరించింది. వేద పండితులు రాముస్వామి, మురళీధరాచార్యులు, శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలను వేద సూక్తులతో కొనసాగించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆద్యంతం కృషి చేసిన రంజిత్‌కుమార్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నీటి తొట్టెలను వినియోగించుకోవాలి


కలకడలో నీటి తొట్టె ప్రారంభిస్తున్న అధికారులు

కలకడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తి తీర్చడానికి ఉపాధి నిధులతో ప్రభుత్వం నిర్మించిన నీటి తొట్టెలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీం పాడిరైతులకు సూచించారు. గంగాపురం పంచాయతీ కురవపల్లెలో పూర్తైన నిర్మాణాలను గురువారం ఆయన ప్రారంభించారు. భవిష్యత్‌లో పశువులకు నీటి కొరత రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, సిబ్బంది రామునాయక్, బాలాజిగౌడ్, రైతుల పాల్గొన్నారు.

నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నేతల డిమాండ్

పీలేరు, పీలేరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణి కుమార్‌పై దాడిచేసి గాయపర్చిన వారి పై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత ముల్లంగి చంద్రయ్య, మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. కేవీపల్లెలో మ్మార్పీఎస్ నేత మాట్లాడుతూ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న ధరణిపై దాడిచేసి గాయపర్చడం అమానుషమన్నారు. మాలమహానాడు నేత మాట్లాడుతూ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డుపై దాడి చేయడం హేయకరమన్నారు.

కొత్త వితంతు పింఛన్ల పంపిణీ వాయిదా

కలికిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గురువారం జరగాల్సిన కొత్త వితంతు పింఛన్ల పంపిణీ కార్యక్రమం చివరి నిముషంలో వాయిదా పడింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా గురువారం సుపరిపాలన-స్వర్ణాంధ్ర పేరుతో ప్రభుత్వం అమరావతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నందున పింఛన్ల పంపిణీని వాయిదా వేస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ కార్యక్రమానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలందరూ హాజరు కావలసి వున్న కారణంగా పింఛన్ల పంపిణీ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇక గురువారం ఉదయం ఇదే సమాచారాన్ని లబ్ధిదారులందరికీ అధికారులు ఫోన్లు చేసి చెప్పారు. తరువాత తేదీని తెలియజేస్తామని కూడా తెలిపారు.

పీలేరు ఈఓ బదిలీ

పీలేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ బదిలీ అయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన గురువారం జరిగిన చిత్తూరు జిల్లా కార్యదర్శుల బదిలీల్లో గురుమోహన్‌ను పీలేరు నుంచి కురబలకోటకు బదిలీ చేశారు.

తిరుపతిరావుకు ఐకాన్ అవార్డు



మదనపల్లె టౌన్, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): ప్రజాచైతన్య స్రవంతి ట్రస్టు అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతి రావును తెలుగు బుక్ ఆఫ్‌రికార్డ్స్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేసింది. పట్టణంలో ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో తిరుపతిరావు చూపిన చొరవకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. సీనియర్ సిటిజన్స్ టీఎస్‌ఏ కృష్ణమూర్తి, కె.వెంకటరమణ, అంజలి తదితరులు ఆయనను అభినందించారు.